ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 20 డిసెంబరు 2024



ఫ్రీహోల్డ్‌లో అసైన్డ్..

1045.09 ఎకరాలు

- ఆ భూములను 22-ఏలో చేర్చాలని ఆదేశాలు
- నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్ల రద్దు
- తప్పు చేసిన ఉద్యోగులపై చర్యలకు ప్రభుత్వ నిర్ణయం
- పునః పరిశీలన చేసి అప్‌డేట్ చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు

గుంటూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా వందల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఇష్టం వచ్చినట్లుగా ఆయా భూములను రిజిస్ట్రేషన్లు చేసేశారు. 2023వ సంవత్సరానికి 20 ఏళ్ల క్రితం అసైన్‌మెంట్ చేసిన భూములను ఫ్రీహోల్డ్ చేయాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే దీని వెనక దురుద్దేశం ఉన్నట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. ఆ ఉత్తర్వులు ఆధారంగా గుంటూరు జిల్లాలో 1623.85, పల్నాడు జిల్లాలో 31,897.32, బాపట్ల జిల్లాలో 13,839.04 ఎకరాల భూమిని ఫ్రీహోల్డ్ చేశారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఫ్రీహోల్డ్ భూములపై విచారణ జరిపించింది. దీంతో వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు వెలుగు చూశాయి. గుంటూరు జిల్లాలో 53.56, పల్నాడులో 138.75, బాపట్ల జిల్లాలో 852.78 ఎకరాల భూమి అసైన్‌మెంట్ భూమి అని తేల్చారు. విలేజ్ సర్వీసు ఇనాం భూములు బాపట్ల జిల్లాలో 668.02, పల్నాడులో 2.13, చుక్కల భూములు పల్నాడులో 107.76 ఎకరాలు, షరతుగల పట్టా భూములు గుంటూరులో 2.83 ఎకరాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం చేసిన ఫ్రీ హోల్డ్ భూములను పునః పరిశీలన చేయించింది. బాపట్లలో 40.38 ఎకరాలు, పల్నాడులో 90.93 ఎకరాలు నిబంధనలకు లోబడి రిజిస్ట్రేషన్లు జరిగాయి. గుంటూరులో 38.24 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేయగా అందులో 11.02 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా చేశారని గుర్తించారు. ఈ నేపథ్యంలో జిల్లాస్థాయి కమిటీలు ప్రతీ ఒక్క కేసుని పునః పరిశీలన చేసి ఆన్‌లైన్‌లో డేటాని అప్‌డేట్ చేయాల్సిందిగా రెవెన్యూశాఖ మూడు జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. అలానే పునః పరిశీలన అనంతరం కేసుల వారీగా ఆర్డర్స్ జారీ చేయాలని సూచించింది. జీవో, నిబంధనలకు లోబడి ఉన్నవి జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌కు నివేదించాలని సూచించింది. వీటి రిజిస్ట్రేషన్లపై ఉన్న నిషేధాన్ని ఉపసంహరించాలని రిజిస్ట్రేషన్ శాఖ ఐజీని ఆదేశించింది. కాగా ఏవైతే నిబంధనలకు విరుద్ధంగా జరిగాయో వాటిని 22-ఏ జాబితాలో తిరిగి చేర్చాలని, అలానే రిజిస్ట్రేషన్లు జరిగిన వాటి పట్టాలను రద్దు చేయాలని సూచించింది. నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసిన రెవెన్యూ ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించింది. దీంతో మూడు జిల్లాల రెవెన్యూ అధికారులు హడలిపోతున్నారు. దీంతో అప్పట్లో తప్పిదాలకు పాల్పడిన రెవెన్యూ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

టీడీఆర్ బాండ్లపై.. విజిలెన్స్

టీడీఆర్ బాండ్లు.. నకిలీ చలానాలు.. ఇష్టం వచ్చినట్లుగా భవనాలకు ప్లాన్ల మంజూరు.. ఇదీ గత ఐదేళ్లుగా మున్సిపాలిటీల్లో జరిగిన అక్రమాలు. ఐదేళ్ల వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు.. మున్సిపల్ అధికారులు కుమ్మక్కయ్యారు. టీడీఆర్ పేరుతో రూ.కోట్లు దోచేశారు. వైసీపీ నేతలు ఆదేశాలు జారీ చేయగా.. అధికారులు ఇష్టం వచ్చినట్లుగా టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. మున్సిపాలిటీల్లో అధికారులు అడ్డగోలుగా ప్లాన్లు మంజూరు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. మొత్తం మీద మున్సిపల్ ఆదాయాలను హరించేసిన నేతలు, అధికారులు ఆ మొత్తాలను పంచుకుని జేబుల్లో వేసుకున్నారు. ఈ వ్యవహారాలు అప్పట్లోనే వెలుగుచూసినా నాటి పాలకులు, అధికారులు పట్టించుకోకుండా అక్రమాలకు సహకరించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం టీడీఆర్ కుంభకోణాలపై విచారణకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెండు రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని రెండు నగరపాలకసంస్థలు, 14 మున్సిపాలిటీల్లో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. అధికారులు బృందాలుగా ఏర్పడి కార్యాలయాల్లో రికార్డులను పరిశీలిస్తూ గతంలో జరిగిన అక్రమాలపై ఆధారాలు సేకరిస్తున్నారు.

- మున్సిపాలిటీల్లో అధికారుల తనిఖీలు
- రెండు కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలపై దర్యాప్తు
- బృందాలుగా ఏర్పడి రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు
- ఐదేళ్లలో జారీ చేసిన బాండ్లు, ప్లాన్ల ఫీజుల వివరాల సేకరణ
- గుంటూరులో గతంలో వెలుగు చూసిన రూ.300 కోట్ల కుంభకోణం
- నకిలీ చలానాలు, అడ్డగోలుగా టీడీఆర్ బాండ్లతో దోపిడీకి యత్నం
- నాడు వైసీపీ నాయకులు, టౌన్ ప్లానింగ్ అధికారి కుమ్మక్కు

తనిఖీలు జరుగుతున్న పురపాలక సంఘాలు

గుంటూరు జిల్లా : గుంటూరు కార్పొరేషన్, తాడేపల్లి- మంగళగిరి కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు.
బాపట్ల జిల్లా : బాపట్ల, రేపల్లె.
పల్నాడు జిల్లా: చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, దాచేపల్లి





నరసరావుపేట పురపాలక సంఘ కార్యాలయం



గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీల్లో టీడీఆర్ బాండ్లు, నకిలీ చలానాలు వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇష్టం వచ్చినట్లు జారీ అయ్యాయి. గుంటూరు, తాడేపల్లి- మంగళగిరి నగర పాలక సంస్థలతో పాటు గుంటూరు జిల్లా పరిధిలోని తెనాలి, పొన్నూరు, బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, రేపల్లె, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, దాచేపల్లి మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. ఈ క్రమంలో టీడీఆర్, నకిలీ చలానాల కుంభకోణాలపై రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ నారాయణ విచారణకు ఆదేశించారు. దీంతో మున్సిపాలిటీల వారీగా విజిలెన్స్ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపడుతున్నారు. ఐదేళ్ల నుంచి ఆయా నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో జారీ అయిన టీడీఆర్ బాండ్లు, బిల్డింగ్ ప్లాన్ అప్రువల్స్‌లో చెల్లించిన ఫీజులు, వాటి వివరాలను సమగ్రంగా సేకరిస్తున్నారు. ఆయా మున్సిపాలిటీల్లో వైసీపీ హయాంలో అధికారులు అడ్డగోలుగా ప్లాన్లు మంజూరు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనేక భవనాలకు ఫీజులు సక్రమంగా చెల్లించకుండానే నిర్మాణాలు చేపట్టారు. భవన నిర్మాణాలకు సంబంధించి మున్సిపాలిటీలకు (మిగతా 8వ పేజీలో)

8

నదిలో రోడ్డు తొలగింపు

- ఆంధ్రజ్యోతి కథనానికి అధికారుల స్పందన
- కాంట్రాక్టర్లకు హెచ్చరికలు జారీ చేసిన తహసీల్దారు

వైద్య కళాశాలకు రూ.కోటి విరాళం

- జూబ్లీ వేడుకల్లో 99వ బ్యాచ్ విద్యార్థుల ప్రకటన

అమరావతి రైల్వేలైన్ కూత

- భూ సేకరణకు కేంద్ర గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- 297.499 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్
- గొట్టుముక్కల, పరిటాలలో 122.91 ఎకరాలు
- వీరులపాడు మండలంలో 174.56 ఎకరాలు

పీసీ చైర్మన్‌పై... కుదరని ఏకాభిప్రాయం

- గోగినేని వైపు ఎంపీ.. ఎమ్మెల్యేల మొగ్గు
- తమ నియోజవర్గానికే ఇవ్వాలంటున్న ముగ్గురు ఎమ్మెల్యేలు
- ఎమ్మెల్యేల అభిప్రాయాలు స్వీకరించిన మంత్రి గొట్టిపాటి
- రేపు పీసీ చైర్మన్.. వైస్ చైర్మన్ పదవులకు ఎన్నిక

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అభ్యర్థిని ఎంపిక చేయడంలో కూటమి నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. చైర్మన్ అభ్యర్థి విషయంలో ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఎవరికి వారు తమ నియోజకవర్గానికి పదవి కేటాయించాలని పట్టుపడుతున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ నిర్వహించిన సమావేశంలో పీసీ చైర్మన్ అభ్యర్థి ఎంపికపై ఆయన ఎమ్మెల్యేల అభిప్రాయాలను స్వీకరించారు. పీసీ రేసులో నలుగురు నేతలు నిలిచారు. వీరిలో ఒకరిని ఏకగ్రీవంగా ఎంపిక చేసే అంశంలో ఎమ్మెల్యేల మధ్య సయోధ్య కుదరడంలేదు. పీసీ పరిధిలో 48 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. 25 డీసీలు ఒక్క పల్నాడు జిల్లాలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాకే పీసీ చైర్మన్ పదవి కేటాయించాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించినట్టు సమాచారం. శనివారం ప్రాజెక్టు కమిటీకి ఎన్నికలు నిర్వహించేందుకు జలవనరుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన గోగినేని కోటేశ్వర రావు, పులిమి రామిరెడ్డి (నరసరావుపేట), పులుకూరి కాంతారావు (గురజాల), పంగులూరి అంజయ్య (మాచర్ల) పీసీ చైర్మన్ బరిలో నిలిచారు. మొత్తం 48 డిస్ట్రిబ్యూటరీలకు గాను పల్నాడు జిల్లాలో 25, గుంటూరు జిల్లాలో 5, బాపట్ల జిల్లాలో 8, ప్రకాశం జిల్లాలో 10 ఉన్నాయి. డీసీ అధ్యక్షులు పీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 25 పీసీలు ఉన్న పల్నాడు జిల్లా నుంచే పీసీ చైర్మన్‌ను ఎన్నుకోవాలని ఎమ్మెల్యేలు ఒక అవగాహనకు వచ్చారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌లతో పాటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు కూడా గోగినేని అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపినట్టు తెలిసింది. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు - పులిమిరామిరెడ్డి, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు - పులుకూరి కాంతారావు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి - పంగులూరి అంజయ్యకు పీసీ చైర్మన్ పదవి కేటాయించాలని సమావేశంలో పట్టుపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంత్రి గొట్టిపాటికి స్వయంగా వారి అభిప్రాయాన్ని తెలియజేసినట్టు సమాచారం. ప్రకాశం, గుంటూరు, బాపట్ల ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని కూడా మంత్రి గొట్టిపాటి స్వీకరించారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలను నివేదిక రూపంలో అధిష్ఠానానికి మంత్రి గొట్టిపాటి అందజేసినట్టు తెలిసింది.



కలెక్టరేట్‌లో పీసీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రాజెక్టు కమిటీకి శనివారం ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు కలెక్టరేట్‌లోని జాషువా హాల్‌లో ఎన్నికల నిర్వహణకు జలవనరుల శాఖ ఏర్పాటు చేస్తోంది. ఎన్నికల అధికారిగా జలవనరుల శాఖ ఎస్సీ పీ కృష్ణమోహన్ వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు 48 డీసీలకు సమాచారం ఇచ్చారు.

జూనియర్ కళాశాలల్లో.. నిబంధనలకు తూట్లు

- ఒకచోట అనుమతి తీసుకుని మరొక చోట తరగతులు
- నోటీసులతో సరిపెడుతున్న ఇంటర్‌బోర్డు.... క్షేత్రస్థాయిలో తనిఖీలేవీ!
- నోటీసులు ఇచ్చి జరిమానా విధించినా తీరుమారని వైనం
- ప్రభుత్వానికి వివిధ ఫీజుల రూపంలో భారీ గండి
- ముంచుకొస్తున్న పరీక్షలు...... విద్యార్థులకు అగచాట్లు తప్పేనా?



ఇంటర్‌బోర్డు కార్యాలయం

గుంటూరు(విద్య),డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కళాశాల నిర్వహించేది ఒకచోట, అడ్రసు మరో చోట.... తీరా అడ్రసులో కళాశాల గురించి వాకబు చేస్తే అక్కడ కళాశాల ఎప్పుడో ఎత్తివేశారని సమాధానం వస్తుంది. ఒక్కోసారి అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు కళాశాల మారినట్లు ధ్రువీకరించుకోవాల్సిన దుస్థితి ఇంటర్‌బోర్డులో నెలకొంది. ఇలా ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ బోర్డు నిబంధనలకు తూట్లు పొడిచి ఇష్టారాజ్యంగా కళాశాలల్ని నిర్వహిస్తున్నా బోర్డు అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో ఇలా నిబంధనలు తుంగలో తొక్కిన 15 కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల్ని గుర్తించిన ఇంటర్ బోర్డు భారీ జరిమానా విధించినా యాజమాన్యాల్లో మార్పు రావడం లేదు. ఇప్పటికే పరీక్షల షెడ్యూల్ విడుదలైనా ఇంటర్ బోర్డు అధికారులు మేలుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, కాంపోజిట్, ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు దాదాపు 360 వరకు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం 48,386 మంది, ద్వితీయ సంవత్సరం 49,390 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇందులో సింహభాగం ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లోనే విద్యార్థులు చదువుతున్నారు. ప్రారంభంలో ఇష్టారాజ్యంగా అడ్మిషన్లు చేయడం తరువాత విద్యార్థుల్ని తమ ఇష్టం వచ్చినట్లు అనుమతి లేని ప్రాంతాలకు తరలించడం ఏటా పరిపాటిగా మారింది. రెండు సంవత్సరాల ఇంటర్ బోర్డు అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇందులో అనేక కళాశాలలు (మిగతా 8వ పేజీలో)

వారెక్కడ

నాడు అరాచకం.. నేడు పరారీ

- ఆరు నెలలుగా ఆచూకీలేని వైసీపీ నేతలు
- వెంకట్రామిరెడ్డి, కిశోర్ అరెస్టులో పోలీసుల విఫలం



పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, తురకా కిశోర్

మాచర్లటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి.. ఇరవై ఏళ్లుగా మాచర్ల నియోజకవర్గాన్ని శాసించాడు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో కన్ను మిన్ను కానకుండా అరాచకాలతో చెలరేగిపోయాడు. తమకు ఎదురే లేదన్నట్లుగా రాజ్యాంగేతరశక్తిగా మారి రౌడీ రాజ్యం సాగించాడు. ఆయన ముఖ్య అనుచరుడిగా తురకా కిశోర్ మాచర్లలో విధ్వంసాలు సాగించాడు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరిద్దరూ పరారీలో ఉన్నారు. నాడు శాసించిన ఆ ఇద్దరూ ఆరు నెలలుగా కుటుంబసభ్యులకు దూరంగా అజ్ఞాతంలో ఉన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడైన వెంకట్రామిరెడ్డి పేరు చెబితే మాచర్ల నియోజకవర్గంలో ప్రజలు హడలిపోయేవారు. అన్న పదవిని అడ్డుపెట్టుకుని వెంకట్రామిరెడ్డి రాజ్యాంగేతరశక్తిగా వ్యవహారాలు సాగించాడు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఆయన చేయని అకృత్యాలు లేవు. ప్రత్యేకంగా యంత్రాగాన్ని ఏర్పాటు చేసుకుని పట్టణం, గ్రామాల్లో తన వర్గంతో రాజకీయాన్ని శాసించాడు. నియోజకవర్గాన్ని శాసించిన పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, నమ్మిన బంటుగా ఉన్న తురకా కిశోర్ ఎన్నికల్లో వైసీపీ ఓటమితో నియోజకవర్గానికి దూరమయ్యారు. ఇప్పటికీ కొన్ని కేసుల్లో బెయిల్ రాకపోవడంతో అజ్ఞాత జీవితం సాగిస్తున్నారు. అయితే వీరిని అరెస్టు చేయడంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు తలుచుకుంటే అరెస్టు చేయగలరని, కానీ వీరి విషయంలో నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారన్న విమర్శలున్నాయి. ఇటీవల దుర్గి మండలానికి చెందిన రౌడీషీటరు ఊరబండి మన్నెయ్య కోర్టులో లొంగిపోవడం చూస్తుంటే పోలీసు వ్యవస్థ ఎంత బాగా పనిచేస్తుందో అర్థమవుతుందన్న ఆరోపణలున్నాయి. ముడుపులు పుచ్చుకుని నిందితులకు సమాచారం చేరవేయడం, లొంగిపోయేందుకు సహకారం అందిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వెంకట్రామిరెడ్డి అకృత్యాలు..

గత ఎన్నికల్లో పోలింగ్ రోజున పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి దౌర్జన్యాలు, దాడులు, దహనాలకు పాల్పడ్డాడు. వెల్దుర్తి మండలం కండ్లకుంట, కొత్తపుల్లారెడ్డిగూడెంలో టీడీపీ తరపున ఏజెంట్లుగా కూర్చున్న నోముల మాణిక్యరావు, రేఖ్యానాయక్, వారి కుటుంబ సభ్యులపై దాడి చేసి బెదిరించాడు. మాచర్ల మండలం కొత్తూరులో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మద్దిగపు వెంకటరామిరెడ్డి కారు అద్దాలు ధ్వంసం చేసి, అడ్డుకోబోయిన ఓ మహిళపై దాడికి పాల్పడ్డాడు. మాచర్లలోని పీడబ్ల్యూడీ కాలనీలో టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి ఇంటిపై దాడి చేసి గృహోపకరణాలు ధ్వంసం చేశాడు. అడ్డుకోబోయిన టీడీపీ కార్యకర్తలను కారుతో విచక్షణారహితంగా ఢీకొట్టించాడు. కార్లు, ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశాడు.

నమ్మిన బంటుగా కిశోర్..

వెంకట్రామిరెడ్డికి నమ్మినబంటుగా తురకా కిశోర్ మాచర్లలో అరాచకాలతో చెలరేగిపోయాడు. ఎవరిపై దాడి చేయాలన్నా, ఆస్తులు ధ్వంసం చేయాలన్నా ముందుగా వెంకట్రామిరెడ్డి కిశోర్‌ను ఉసిగొల్పేవాడు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ తరపున ఎన్నికల పరిశీలనకు వచ్చిన బుద్ధా వెంకన్న, బొండా ఉమ, న్యాయవాదిపై కర్రలతో దాడి చేసి చంపేందుకు ప్రయత్నించాడు. జూలకంటి బ్రహ్మానందరెడ్డికి షెల్టర్ ఇచ్చాడని టీడీపీ సానుభూతిపరుడి ఇంటిపై దాడి చేసి గృహోపకరణాలు ధ్వంసం చేశాడు. 2022 డిసెంబరు 16న ఇదేం కర్మ కార్యక్రమం చేపట్టిన బ్రహ్మానందరెడ్డి అనుచరులపై దాడి చేశాడు. ఆ తర్వాత రౌడీమూకలను కూడగట్టుకొని టీడీపీ నేతల కార్లు, ఇళ్లు, పార్టీ కార్యాలయం ధ్వంసం చేసి తగలబెట్టి బీభత్సకాండ సృష్టించాడు. దీంతో కిశోర్‌కి పురపాలక సంఘ చైర్మన్ పదవిని వెంకట్రామిరెడ్డి కట్టబెట్టాడు.

వర్సిటీలో అంతర్ కళాశాల క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం

పెదకాకాని, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో అంతర కళాశాల క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ప్రారంభించారు. రేపల్లెలోని సాధన డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు యూనివర్సిటీ పరిధిలో ఉన్న 23 కళాశాలల జట్లు పాల్గొన్నాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు ఆటవిడుపుగా క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. వ్యాయామ విద్య డైరెక్టర్ పి.పి.ఎస్ పాల్ కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీలో అధునాతన సౌకర్యాలని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. ఫార్మసీ కళాశాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ గ్రౌండ్‌ను రిజిస్ట్రార్ సింహాచలం ప్రారంభించారు. ఈ నెల 30 వరకు జరిగే ఈ పోటీలలో మొదటి రోజు విజేతలను ప్రకటించారు. పీఏఎస్ పెదనందిపాడు ఆర్ట్స్ కళాశాలపై ఏఎస్‌యూ ఇంజనీరింగ్ కళాశాల, జేకేసీ కళాశాలపై ఏఎన్యూ సైన్స్ కళాశాల, ముప్పాళ్ళ ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలపై నాగార్జునసాగర్‌లోని ఏపీఆర్ డీసీ కళాశాల, మాచర్లలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాలపై విజ్ఞాన్ డిగ్రీ కళాశాల గెలుపొందాయని పేర్కొన్నారు.

దాచేపల్లి, మాచవరం ఎంపీడీవోలు రిలీవ్

గుంటూరు సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి, మాచవరం మండలాల్లో పనిచేస్తున్న ఎంపీడీవోలను జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు విధుల నుంచి రిలీవ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ రద్దు అయిన తరువాత అక్కడ పనిచేస్తున్న అధికారులను వివిధ శాఖలకు కేటాయించారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు కేటాయించిన పి. శ్రీనివాసరావు ను మాచవరం ఎంపీడీవోగా, పి.రామకృష్ణను దాచేపల్లి ఎంపీడీవోగా నియమిస్తూ ఆగస్టు 22న జడ్పీ సీఈవో ఆదేశాలు జారీ చేశారు. ఈ ఇరువురు అధికారులు విధుల్లో చేరిన తర్వాత జీతభత్యాల చెల్లింపుల్లో ఉన్న వ్యత్యాసాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 12న ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పును వెలువరించింది. తీర్పు నేపథ్యంలో పంచాయతీ రాజ్ కమిషనర్ సదరు ఎంపీడీవోలను రిలీవ్ చేయాలని, ఆర్థిక శాఖలో రిపోర్ట్ చేయాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సహకార అక్రమార్కులకు అరదండాలు

- 72 మంది ప్రభుత్వ అధికారులపై క్రిమినల్ చర్యలు
- గుంటూరు జీడీసీసీపై సహకార సంఘాల కమిషనర్ కొరడా



గుంటూరు జీడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం

గుంటూరు సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలను కొల్లగొట్టిన వారిపై చర్యలకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్, రిజిస్ట్రార్ గుంటూరు జీడీసీసీ అక్రమాలపై కన్నెర్ర చేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'అందరి సహకారంతో అక్రమాలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని వైసీపీ నేతలు కాజేసేందుకు సహకరించిన 72 మంది అధికారులపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సహకార అధికారి వీరాచారి గురువారం వెల్లడించారు. వారిలో 20 మంది ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సీఈవోలు, 22 మంది జీడీసీసీ బ్యాంకు సిబ్బంది, 9 మంది రెవెన్యూ అధికారులు, 21 మంది సహకార శాఖ అధికారులు ఉన్నట్లు ఆయన తెలిపారు. వీరితో పాటు మొత్తం కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్న 184 బినామీ రైతులు, 65 మంది సంఘ పాలకవర్గ సభ్యులపై కూడా కేసులు పెట్టనున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో ఉన్న 17 సహకార సంఘాల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావటంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో రూ. 1067.97 లక్షలు రుణాల పేరుతో దారిమళ్లించినట్లు తేలిందని పేర్కొన్నారు. అధికారులు అక్రమార్కులకు అడుగడుగునా సహకరించినట్లు తేలటంతో వారిపై క్రిమినల్, సివిల్ చర్యలకు ఉపక్రమించామని తెలిపారు. ఆయా అధికారులపై క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకుంటునట్లు సహకార అధికారి వీరాచారి అన్నారు. అదేవిధంగా ఈ నెల 18న 'ఆంధ్రజ్యోతి' మెయిన్ లో 'సహకార సంఘాల్లో రూ.425 కోట్లు గల్లంతు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై కూడా రాష్ట్ర అధికారుల ఆదేశాలు మేరకు విచారణ చేపట్టామని వీరాచారి తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో ఉన్న 167 సహకార సంఘాలు, 42 జీడీసీసీ బ్యాంకు శాఖల్లో ఈ విచారణ జరుగుతుందని ఆయన తెలిపారు.

వేరే జిల్లాలు వెళ్లేందుకు ప్రయత్నాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జీడీసీసీ రుణాల మంజూరు వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు అధికారులు వేరే జిల్లాలకు బదిలీ అయ్యేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నత స్థాయిలో ప్రయత్నం జరుపుతున్నట్లు సమాచారం. ఇక్కడ నుంచి వెళ్లిపోతే విచారణ బాధలు తగ్గుతాయన్న ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడిన జీడీసీసీ మేనేజర్‌లు, అసిస్టెంట్ మేనేజర్‌లు, సూపర్ వైజర్లను కాపాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నవంబరు 6వ తేదీన హైకోర్టు సదరు ఉద్యోగులకు వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది. సివిల్, క్రిమినల్ చర్యలు నిలువరించాలని కోరుతూ వారు చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. అయితే తీర్పు వచ్చిన తరువాత సహకార శాఖ బాధ్యులపై చర్యలకు ఉపక్రమించింది. ప్రత్తిపాడు జీడీసీసీ పరిధిలోని ఏడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. రెడ్డిపాలెం సొసైటీ అక్రమాలకు కారణమైన వారిపై కూడా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాధ్యులైన ఉద్యోగుల ను గుంటూరు కు పిలిపించి విచారణ చేపట్టారు. జీడీసీసీ సీఈవో కృష్ణవేణి సంబంధిత ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని చెబుతున్నారు.

గుంటూరు జిల్లా ఎడ్లజతకు ప్రథమం స్థానం



సత్తా చాటిన పాతమల్లాయిపాలెం ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత పాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా గురువారం ఆరుపళ్ల విభాగంలో పోటీలు జరిపారు. గుంటూరు జిల్లా ప్రతిపాడు మండలం పాతమల్లాయిపాలెంకు చెందిన సిద్ధంశెట్టి సామ్రాజ్యం ఎడ్లజత నిర్ణీత సమయంలో 5201 అడుగులతో ప్రథమస్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లా విజయవాడకు చెందిన వల్లభనేని మోహన్‌రావు ఎడ్లజత 5 వేల అడుగులతో రెండోస్థానం, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లజత 4600 అడుగులతో మూడోస్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 4324 అడుగులతో నాలుగోస్థానం, పల్నాడు జిల్లా గురజాలకు చెందిన లింగా ధరణిచౌదరి ఎడ్లజత 4256 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి. కమిటి సభ్యులు తెన్నీటి బుచ్చిబాబు, నల్లా లక్ష్మయ్య, నెల్లూరి మల్లయ్య, నాగేశ్వరరావు, విశ్వనాథం, చలవాది శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

'ఉపాధి' అవినీతి మయం

- కళాశాలలో చదువుకునే విద్యార్థులూ కూలీలే
- రికవరీకి ఆదేశించిన ప్రాజెక్టు డైరెక్టర్



సభలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ లింగమూర్తి

రాజుపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం మండలంలో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆ సమయంలో జరిగిన ఉపాధి పనులకు రానివారికి సైతం హాజరువేసి నగదు వారి అకౌంట్‌కు జమ చేశారు. పట్టణాలలో ఉండేవారికి, కళాశాలలో చదుకునే వారికి, వ్యాపారాలు చేసుకునే వారికి నగదు వారి ఖాతాకి జమ చేసినట్లు గుర్తించారు. గత కొద్దిరోజుల నుంచి రాజుపాలెం మండలంలో సోషల్ అడిట్ బృందం ఆయా గ్రామాల్లో తనిఖీలు చేయటంతోపాటు కూలీలను విచారించారు. అనంతరం గురువారం నిర్వహించిన ప్రజావేదికలో గ్రామాల వారిగా గుర్తించినటువంటి అంశాలను ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బృందం వారు గుర్తించిన అంశాలలో ప్రభుత్వ శాఖలలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, బెంగళూరు, హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేసుకునే వారిని ఉపాధి హామీ పథకం కింద పనులకు హాజరైనట్లు చూపించి నగదు జమ చేశారని ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తెచ్చారు. అంతేకాకుండా చాలాచోట్ల పని వివరాలు తెలియజేయలేదన్నారు. హాజరు పట్టికలో తేడాలు గుర్తించామన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ లింగమూర్తి ఉపాధి హామీ పథక సిబ్బంది పనితీరుపై మండిపడ్డారు. మండలంలో మొత్తం మీద రూ. 10,52,97506 పనులు జరిగినట్లు ఏపీడీ నారాయణ తెలిపారు. వాటిల్లో రూ. 255663 నగదు రికవరీకి ఆదేశించారు. రూ. 174848 నగదుకు సంబంధించి మళ్లీ ప్లాంటేషన్ చేయిస్తామని ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ సత్యానారాయణ, జె.ప్రభాకర్, విజిలెన్స్ అధికారి విజయకుమారి, ఎస్ఆర్‌పీ లోకేష్, ఏపీవో వెంకటేశ్వర్లు ఉన్నారు.

ముగిసిన ఐపీఎస్‌జీఎం క్రీడలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శేఖర్

గుంటూరు(విద్య), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఐపీఎస్‌జీఎం-2024 క్రీడా పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. రాష్ట్రస్థాయిలో క్రీడలు జనవరి 28, 29, 30 తేదీల్లో విశాఖపట్నంలో జరుగుతాయని ప్రిన్సిపాల్ టిశేఖర్ తెలిపారు.

పోటీల్లో విజేతలు వీరే...

వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ కప్ ఫర్ బాయ్స్‌ను దేముడు (మైనార్టీ ప్రభుత్వ పాలిటెక్నిక్, నల్లపాడు), గేమ్స్ ఛాంపియన్‌షిప్ కప్ ఫర్ బాయ్స్‌ని బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ, స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ ఫర్ బాయ్స్ ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ గెలుచుకున్నాయి. అదేవిధంగా ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కప్ ఫర్ బాయ్స్‌ను ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, నల్లపాడు విద్యార్థులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో బీడబ్ల్యూఎం డైరెక్టర్ వి.శంకర్, జిమ్నాస్టిక్స్ ఫెడరేషన్ కార్యదర్శి నంబూరు సుబ్బారావు, టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం, బలరామకృష్ణ స్పిన్నింగ్ మిల్ అధినేత వంకాయలపాటి బలరామకృష్ణయ్య తదితరులు బహుమతులు అందజేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101,109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

ప్రతి రైతుకూ యూనిక్ ఐడీ



సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లీరావు

ఫిరంగిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ఒక్క రైతుకు యూనిక్ ఐడీని ఏర్పాటు చేసి ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గురువారం మండలంలోని నుదురుపాడు గ్రామంలో కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని నుదురుపాడు, మేరికపూడి, గుండాలపాడు, వేమవరం గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రైతులందరికీ యూనిక్ ఐడీ ఇస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద ప్రభుత్వం అందించే రూ.6 వేలు గ్రాంట్‌కు అర్హులవుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు వ్యవసాయ డైరెక్టర్ కె.విజయలక్ష్మి, వ్యవసాయ సంచాలకులు బాల సుబ్రహ్మణ్యం, గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి జె.వాసంతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

60,185 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 62,930 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 60,185 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 51,277 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	7500	14300
నెంబరు. 5	8000	12000	నెంబరు.5	7500	12000
273	9000	11000	273	8500	8500
341	7500	15000	341	7500	13000
4884	--	--	4884	9000	14200
సూపర్ 10	9500	9500	సూపర్ 10	9000	9000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16500	తేజ	8000	16200
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	8500	12500
దేవనూరు డీలక్స్	8500	15000	దేవనూరు డీలక్స్	8000	12000
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	10000

దౌత్య సంబంధాలు మరింత బలోపేతం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న భారత్, మడగాస్కర్ దౌత్య ప్రతినిధులు

గుంటూరు(విద్య), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత్, మడగాస్కర్ దేశాల మధ్య అకడమిక్, పరిశోధనలు, అగ్రికల్చర్ రంగం విభాగాల్లో టెక్నాలజీతోపాటు పరస్పర అవగాహన, దౌత్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని మడగాస్కర్‌లోని మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పెడగాజి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇన్‌ఛార్జి రావోనిహెరిజఓనా ఆండ్రియామియాకట్సిలావో అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్, అకాడమీ ఫర్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో 'కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్‌ను గురువారం ఘనంగా ముగించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రావోనిహెరిజఓనా ఆండ్రియామియాకట్సిలావో మాట్లాడుతూ తమ దేశంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ మడగాస్కర్ ప్రభుత్వానికి తమ యూనివర్సిటీ, పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు సమర్థమైన కరిక్యులం సృష్టించడంలో సహాయం అందిస్తామన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, మడగాస్కర్‌లోని మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రాండ్రియానరివో హసినైనా రిచర్డ్, మాస్ అండ్ సివిక్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఫియాంగో మానపోక్ జుడిత్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

విదర్భపై రాజస్థాన్ ఘనవిజయం



అగర్వాల్ (65 పరుగులు)

మంగళగిరి సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో విదర్భ జట్టుపై రాజస్థాన్ 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 205 పరుగులు చేయగా, రాజస్థాన్ 159 పరుగులకు ఆలౌటయింది. యథార్థ్ భరద్వాజ్ 101 పరుగులు చేయగా, విదర్భ బౌలర్లు దేవాన్ష్ నింబాల్కర్ 4, ఓం ధోత్రే 3 వికెట్లు పడగొట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో విదర్భ జట్టు 67.5 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటయింది. రాజస్థాన్ బౌలర్లు పెరు దేవాద్వల్ 3, హర్షా సింగ్ 3, సుజల్ పర్మార్ 2 వికెట్లు పడగొట్టారు. 189 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన రాజస్థాన్ జట్టు 35 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. విదర్భ బ్యాటర్లు ఆరాధ్య అగర్వాల్ 65, రాహుల్ 42, రజత్ భాగేల్ 33 పరుగులు చేశారు. ఈ మ్యాచ్‌లో విజయం సాధించడంతో రాజస్థాన్ జట్టు 6 పాయింట్లు సొంతం చేసుకుంది.

ముగిసిన పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్‌మీట్



విజేతలతో కళాశాల ప్రిన్సిపల్ ఉషారాణి

గుంటూరు(విద్య), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా గుంటూరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి 27వ మహిళల ఇంటర్ పాలిటెక్నిక్ ఆటల పోటీలు గురువారం ముగిశాయి. ఈ ఆటల పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ఇన్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్, గేమ్స్ ఛాంపియన్‌షిప్, స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్, వ్యక్తిగత స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ అన్నింటినీ ఉమెన్స్ పాలిటెక్నిక్ గుంటూరు కళాశాల విద్యార్థినులు కైవశం చేసుకున్నారు. స్పోర్ట్స్‌లో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ గుంటూరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థిని ఈసీఈ బ్రాంచ్‌కి చెందిన కె.నవ్య దక్కించుకుంది.

పోటీల్లో విజేతలు వీరే...

ఖోఖో విన్నర్స్- మహిళా పాలిటెక్నిక్, గుంటూరు వాలీబాల్ విన్నర్స్- సెయింట్ మేరీ ఉమెన్ పాలిటెక్నిక్, బ్యాడ్మింటన్ సింగిల్స్ విన్నర్స్ - సాయితిరుమల కాలేజి, బ్యాడ్మింటన్ డబుల్స్ విన్నర్స్‌గా - సెయింట్ మేరీస్ ఉమెన్స్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్ విన్నర్స్‌గా హిందూ కాలేజ్, టేబుల్ టెన్నిస్ డబుల్స్ విన్నర్స్‌గా మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులు నిలిచారు. ఈ సందర్భంగా కళాశాలల సిబ్బందికి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. పోటీల్లో విన్నర్స్‌గా పొన్నూరు ప్రభుత్వ పాలిటెక్నిక్, రన్నర్స్‌గా మహిళా పాలిటెక్నిక్ గెలుపొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి, పొన్నూరు పాలిటెక్నిక్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 578.30 అడుగులు ఉంది. ఇది 278.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8067 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,988 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 49,035 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1998 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు

ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజరుగా ఫాతిమా

సత్తెనపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ సత్తెనపల్లి డిపో అసిస్టెంట్ మేనేజరుగా నియామకం పొందిన ఫాతిమా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె గుంటూరు డిపో నుంచి బదిలీపై సత్తెనపల్లి వచ్చారు. ఈ సందర్భంగా ఫాతిమాకి ఆర్టీసీ డిపో అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



● సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావే శానికి హాజరు కావాలని కోరారు.

● పిడుగురాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యలయంలో జరుగనున్నదని ఎంపీడీవో సీహెచ్ రామ చంద్రరావు తెలిపారు. సమావేశానికి సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

● భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మండలంలోని తాళ్ళచెరువు గ్రామానికి చెందిన రేపూడి జయపాల్, విజయలక్ష్మి గార్ల కుమారుడు డాక్టర్ నవీన్ చక్రవర్తి(ఐపీఎస్), డాక్టర్ రేపూడి ప్రణయ దంపతులను గురువారం ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ కలిసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. నవీన్ చక్రవర్తి గుజరాత్‌లో అడిషనల్ ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. - **అచ్చంపేట**

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 40.92 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 2వేల క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నారు.

ముగిసిన శిక్షణ..

వెల్దుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత నాలుగురోజులుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి లక్ష్యసాధనకై కృషి చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ చల్లగుండ్లకి సత్కారం

గురజాలటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపాటేశ్వర అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా పట్టణంలో గురువారం ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు చల్లగుండ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకాగా ఆయనను ఆయన్ను కూటమి నేతలు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు.

కుట్టుమిషన్లు పంపిణీ

పిడుగురాళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం 11 మంది మహిళలకు కుట్టుమిషన్లను అందజేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో నీరుమళ్ల రాజేష్, డాక్టర్లు పంగులూరి విష్ణుబాబు, గుర్రం కృష్ణకాంత్, భవనాశి నరసింహారావు, జూలకంటి సుబ్రహ్మణ్యం, పసుమర్తి సుబ్రహ్మణ్యం, వంకాయల గోపి, కొత్త సత్యం, గురవయ్య పాల్గొన్నారు.



చిన కోటేశ్వరరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్

నిబద్ధత గల నాయకుడు

చిన కోటేశ్వరరావు

క్రోసూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండలం బాలెమర్రు గ్రామ మాజీ సర్పంచ్ ముసులూరి చిన కోటేశ్వరరావు నిబద్ధత గల టీడీపీ నాయకుడని, ఆయన మృతి టీడీపీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఇటీవల మరణించిన చిన కోటేశ్వరరావు విగ్రహాన్ని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ ఆవిష్కరించిన విషయం విదితమే. గురువారం బాలెమర్రు గ్రామానికి వచ్చిన కొమ్మాలపాటి శ్రీధర్ చిన కోటేశ్వరరావు విగ్రహానికి నివాళులర్పించారు. ఆయనతో పాటు వేగుంట రాణి, తాళ్ళూరి ధనలక్ష్మి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అన్నదాతకు తుఫాన్ గండం

- వాతావరణశాఖ హెచ్చరికతో ఆందోళన
- గత నెల నుంచి మూడు తుఫాన్‌లు
- కోతలు వాయిదా వేసుకున్న రైతులు
- పంట రక్షణకు తగిన చర్యలు
- ఇదే అదనుగా పెరిగిన కోత ఖర్చులు.. తగ్గిన ధాన్యం ధరలు



ధాన్యం రాసులపై పట్టలు కప్పుకుంటున్న రైతులు

తుఫాన్ ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నవంబరు నుంచి ఇప్పటి వరకు మూడు తుఫాన్‌లు పల్నాడు జిల్లాలో పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. ప్రస్తుతం వరి సాగు చేసిన రైతులు పంట చేలపై ఉండటంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వరికోతలు ముమ్మరమైన వేళ తుఫాన్ ప్రభావం పంట దిగుబడిపైనే కాకుండా రైతులపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోంది.

పిడుగురాళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరుస తుఫాన్‌ల ప్రభావం అన్నదాతలను అతలాకుతలం చేస్తోంది. ఎకరాకు వేల రూపాయలు ఖర్చుచేసి పంట చేతి కొస్తున్న తరుణంలో తుఫాన్ ముంచుకురావడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. గురువారం కూడా పల్నాడులోని దాచేపల్లిలో వర్ష ప్రభావంతో ధాన్యం తడిసిపోయింది. కొందరు రైతులు తుఫాన్ హెచ్చరికతో కోతలను వాయిదా వేసుకుంటున్నారు.

వర్ష ప్రభావం కారణంగా పంట ధరలపై ప్రభావం చూపే అవకాశం వుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా తుఫాన్ హెచ్చరిక ప్రభావంతో రైతులు వరి కళ్లాల నూర్పిడిలో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ కొద్ది చోట్ల గింజలు రాలి పోతుండటం, అదును దాటితే కోత యంత్రాలు దొరకడం ఇబ్బందిగా వుండే పరిస్థితి వస్తుండటంతో రైతులు సతమతమవుతున్నారు. ఇదే అదునుగా వరి కోత యంత్రాల యజమానులు ధర పెంచుతున్నారు. ప్రస్తుత తుఫాన్ ప్రభావం వరికోతలు, కుప్పలు, నూర్పిడిలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మిరప, పత్తికి ఏ ఇబ్బంది కలిగే అవకాశంలేదు. గురువారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి పలు చోట్ల వర్షం కురవడంతో రైతులు ధాన్యం రాసులపై పట్టలు కప్పి పంటను సంరక్షించుకున్నారు.




దాచేపల్లిలో వర్షం కురవడంతో తడిసిన ధాన్యం

తగ్గిన ధాన్యం ధర..

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండల పరిధిలోని గ్రామాల్ల గురువారం తెల్లవారుజాము 3 గంటల సమయంలో హఠాత్తుగా వర్షం కురిసింది. గత మూడు రోజులుగా కోత కోసిన ధాన్యాన్ని తేమగా వుండటంతో నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోశారు. సుమారు 5వేల బస్తాల ధాన్యం ఆరబోసినట్లు రైతులు తెలిపారు. ఎక్కువగా పిడుగురాళ్ల మండలం వీరాపురం, శాంతి నగరం, దాచేపల్లి గ్రామాలకు చెందిన మాగాణి భూముల రైతుల ధాన్యం అధికంగా వుంది. ఇప్పటి వరకు 100 కేజీల ధాన్యం బస్తా రూ.2,200 నుంచి రూ.2,300వరకు కొనుగోలు చేస్తున్నారు. వర్షంతో ధాన్యం తడిచిపోవడంతో 100కేజీల బస్తా రూ.1800 నుండి రూ.2000 వరకు వ్యాపారులు అడుగుతున్నారు. ఇప్పటికే ఆర్థికంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ధాన్యం బస్తాలను రూ.2,500లకు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

గట్టెక్కేదెలా : చిరుమామిళ్ల లక్ష్మయ్య, రైతు



ఎప్పుడూ లేని విధంగా వరికోతలు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటికి మూడు తుఫాన్‌ల హెచ్చరికను వ్యవసాయ ప్రకటించడం రైతుల్లో ఆందోళన గురి చేస్తుంది. వరికోతలు కోయనవి, కోసిన వాటికి కూడా దిగుబడి ప్రభావం తుఫాన్ వల్ల కలుగుతుండటం రైతుకు కాస్త నష్టం చేకూరే అవకాశం వుంది.

హెలిప్యాడ్ ల్యాండింగ్ కోసం స్థల పరిశీలన

గురజాలటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జనవరి 1న మండలంలోని పులిపాడులో నిర్వహించనున్న పింఛన్ పంపిణీ పాల్గొన నుండటంతో గురువారం కలెక్టర్ అరుణ్‌బాబు గ్రామంలో హెలిప్యాడ్ ల్యాండింగ్ కోసం స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని సచివాలయం-2, నడికుడి రోడ్డు, హైస్కూల్, ఎస్సీ కాలనీ వద్ద స్థలాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట జేసీ సూరజ్ గనోరే, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, వీరి వెంట గురజాల డీఎస్పీ జగదీష్, ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ నగేష్, సీఐ భాస్కర్, కూటమి నేతలు మాజీ ఎంపీపీ పులుకూరి కాంతారావు, మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



హెలిప్యాడ్ ల్యాండింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

● పల్నాడుజిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు



డీఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ

సత్తెనపల్లి, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని పల్నాడుజిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు సత్తెనపల్లి సబ్ డివిజన్‌లోని డీఎస్పీ, సీఐలను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం సత్తెనపల్లి డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ తనిఖీ చేశారు. సబ్ డివిజన్ ఆఫీసు పరిసరాలను, మ్యాప్‌లను పరిశీలించారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐలు, డీఎస్పీతో సమీక్ష నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా, వినియోగం కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ అవేర్ కార్యక్రమం ద్వారా సైబర్ నేరాల పై అన్ని విద్యా సంస్థల్లో, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పించాలన్నారు. రోడ్డుప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించటం, స్టాపర్స్ ఏర్పాటు, డ్రంక్ డ్రైవ్ నిర్వహించటం తదితర కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలతో పోలీసు సిబ్బంది కలసిమెలసి ఉండాలని, గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని డీఎస్పీ హనుమంతరావుకు సూచించారు. డీఎస్పీతో పాటు పట్టణ, రూరల్, క్రోసూరు, అచ్చంపేట సీఐలు ఉన్నారు.

ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి

● గురజాల డీఎస్పీ జగదీష్

కారంపూడి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): బాధితులు వారి సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో స్నేహపూర్వకంగా మెలగాలని గురజాల డీఎస్పీ జగదీష్ సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన స్టేషన్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాలపై నిత్యం పర్యవేక్షణ ఉండడాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. డీఎస్పీతో సీఐ టీవీ శ్రీనివారావు, ఎస్ఐ వాసు, రెంటచింతల ఎస్ఐ నాగార్జున ఉన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి చేద్దాం

● ఎంపీడీవో కే.సరోజనిదేవి

రెంటచింతల,డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో వచ్చే ఆదాయం లేకున్నా కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ నిధులతో పేదరికం లేని గ్రామాలను తయారు చేయవచ్చని ఎంపీడీవో కే.సరోజనిదేవి అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల చేరువలో భాగంగా నాల్గవ రోజైన గురువారం సర్పంచ్‌లు, కార్యదర్శులు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను, కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటి ద్వారా వారు లబ్ధి పొందేవిధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ శ్రీనివాసరావు,ఏఈలు వెంకటేశ్వరరెడ్డి,వెంకటేష్, శ్రీనివాసరావు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

క్రీస్తు బోధనలు ఆచరణీయం

● సెమీక్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మానవాళికి క్రీస్తు బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని 21వ వార్డు బాప్టిస్ట్ చర్చిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్రైస్తవులంతా ఏసు క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాస్టర్ నతానియేలు, టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, కరిముల్లా, జాన్‌బాబు పాల్గొన్నారు.

టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ మాదిగల ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని కీస్తు సందేశాన్ని అందించారు. కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఫాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాదిగ సోదరులు కన్నా లక్ష్మీనారాయణకు జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, నాయకులు బలిజేపల్లి సురేష్ కుమార్, బండారు నాగరాజు, అంకాళ్ళ ప్రభుదాసు, ఎల్ రవి, బొక్కా సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువయ్యేందుకే 'మీతో మేము'

● సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు

క్రోసూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత చేరువయ్యేందుకే పోలీసు శాఖ 'మీతో మేము' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు అన్నారు. గురువారం ఆయన క్రోసూరు పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. సైబర్ నేరాల అవగాహన, పోలీసుశాఖ నుంచి అందే సేవలు వంటి విషయాలు ప్రజలకు సులభంగా దృశ్యరూపంలో అర్థమయ్యేలా వివరించేందుకే 'మీతో మేము' కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందుకోసం సత్తెనపల్లి సబ్ డివిజన్ లోని అన్ని పోలీసు స్టేషన్లలో శాటిలైట్ అనుసంధానంతో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రోసూరు పోలీసు స్టేషన్‌లో 'మీతో మేము' డిజిటల్ బోర్డును డీఎస్పీ ప్రారంభించారు. జరుగుతుందన్నారు. ఎస్పీ కే.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ వినూత్నమైన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం పోలీసుస్టేషన్‌లోని లాకప్ గదులను, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. సీఐ ప్రత్తిపాటి సురేష్, ఎస్ఐ నాగేంద్ర బాబులకు పలు సూచనలు చేశారు.



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

వివిధ ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సులు

ముప్పాళ్ళ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆయా నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో గురువారం అధికారులు రెవెన్యూ సదస్సులను నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ముప్పాళ్ల మండలం తొండపి గ్రామంలో రైతులు, గ్రామస్థుల నుంచి 93 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ ఎం భవానీ శంకర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసాదు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి): తాళ్ళచెరువు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 15 అర్జీలు రాగా 1 అర్జీని మాత్రమే అక్కడిక్కడే పరిష్కరించినట్లు తహసీల్దార్ కే శ్రీనివాసరావు తెలిపారు.

దాచేపల్లి(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో స్థానిక ప్రజలు నివాసముంటున్న ప్రాంతాల్లోని భూమి కూడా రెడ్ మార్క్‌లో వుందని, దీనిని తొలగించాలని గ్రామస్థులు, నేతలు తహసీల్దార్ వైవీ కుటుంబరావుకి ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షరీఫ్, స్థానిక ప్రజలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నకరికల్లు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేజర్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకి రైతులు అధిక సంఖ్యలో హాజరై డిప్యూటీ తహసీల్దార్ కే శ్రీనివాసరావుకి అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ పురుషోత్తం, వీఆర్వో రమణారెడ్డి, సర్వేయర్లు వెంకటేశ్వర్లు, జెట్టి మణి పాల్గొన్నారు.

దుర్గి,(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగుట్లలో రైతుల నుంచి ఆరు అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఫణీంద్రకుమార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం, తురకపాలెం గ్రామాల్లో భూ సంబంధిత సమస్యలపై రైతులు, స్థానికుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ క్షమారాణి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యామని రామారావు, మునగాల సాంబయ్య, ఎం.మల్లయ్య, మోహనరావు, ఆర్ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్ సాల్మన్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

రెంటచింతల,(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో రైతుల నుంచి 23 అర్జీలు స్వీకరించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ నగేష్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి, ఆర్ఐ పల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం, తురకపాలెం గ్రామాల్లో తహసీల్దార్ క్షమారాణి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ యామని రామారావు, ఆర్ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్ సాల్మన్ రాజు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల,(ఆంధ్రజ్యోతి): గుత్తికొండ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదసుసలో రైతుల వద్ద నుంచి 11 దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ మధుబాబు తెలిపారు. ఈ సదస్సులో మాజీ ఎంపీపీ యడపల్లి నారాయణ, డీసీ చైర్మన్ గండికోట వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ బండ్ల శేఖరయ్య, బండ్ల జోగయ్య, పావులూరి కోటేశ్వరరావు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనుబాబు, లక్ష్మానాయక్, వీఆర్వోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తకు

రూ.50 వేలు ఆర్థికసాయం

మాచర్ల రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని జమ్మలమడకు చెందిన జనసేన కార్యకర్త కూరాకుల నాగేశ్వరరావుకు గురువారం గుంటూరులోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నేతలు రూ. 50 వేల చెక్కును ఆర్థికసాయంగా అందజేశారు. నాగేశ్వరరావు వైద్య ఖర్చుల నిమిత్తం జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ చెక్కును పంపినట్లు పార్టీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు సాంబశివరావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా !

సమందర్‌వలి, వెల్దుర్తి ఎస్ఐ





వెల్దుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో దొంగతనాలు నిరోధించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇందు కోసం ఆయా గ్రామాల్లోని కూడళ్లలో మండలంలో ప్రస్తుతం 44 సీసీ కెమెరాలు అమర్చామని, మరో 20 కెమెరాలను వారం రోజుల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్దుర్తి ఎస్ఐ సమందర్ వలి తెలిపారు. మండల పరిధిలో నేరాలు, దొంగతనాల కట్టడికి పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలపై ఆయనతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి **'ఫటాఫట్.'**

ప్ర: ఇటీవల జరిగిన చోరీలపై ఏ చర్యలు తీసుకున్నారు?

జ: ఇటీవల కాలంలో మండల పరిధిలో మండాది, శిరిగిరిపాడు తదితర గ్రామాల్లోని పొలాల్లో కొందరు వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరును అపహరించారు. ఈ కేసులకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకొని 300 కేజీల రాగివైరును స్వాధీనం చేసుకున్నాం. అలాగే ద్విచక్ర వాహనాల దొంగలను గుర్తించి 10 బైకులను స్వాధీనం చేసుకోవడంతోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నాం. మండలంలోని కండ్లకుంటలో గల గుడిలో హుండీ పగులకొట్టి నగదు అపహరించిన కేసులో ముగ్గురుని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 1,08,250ల సొత్తును స్వాధీనం చేసుకున్నాం.

ప్ర: గంజాయి, నాటుసారాను ఏవిధంగా కట్టడికి చేయనున్నారు?

జ: ఇటీవల మండల పరిధిలో గంజాయి విక్రయాలపై తమకు వచ్చిన సమాచారం మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. అలాగే నాటుసారా బట్టీలపై దాడులు జరిపి 2 వేల లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేయడంతో పాటు 250 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశాం.

ప్ర: బెల్ట్ షాపుల ఏర్పాటుని పూర్తిగా అడ్డుకున్నారా?

జ: మండల పరిధిలోని గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదు. దాడులు జరిపి చట్టపరమైన చర్యలు చేపడతాం. ఎక్కడైనా, ఏ గ్రామంలోనైనా బెల్టు షాపు ఏర్పాటు చేసినట్లు సమాచారం అందితే తగిన చర్యలు తీసుకుంటాం.

ప్ర: రేషన్ బియ్యం అక్రమ రావాణా ఆగినట్టేనా?

జ: రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాం. గ్రామాల్లో సిబ్బందిని ఏర్పాటు చేశాం. ఎక్కడైనా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకుంటాం.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఉండవల్లిలోని ఆయన నివాసంలో గురువారం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కలిశారు. నియోజకవర్గంలో చేపట్టిన, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను సీఎంకి వివరించినట్లు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు, పంగులూరి అంజయ్య, కజ్జం సైదయ్య తదితరులు ఉన్నారు. - **మాచర్లటౌన్**



వివాహిత మృతదేహం లభ్యం

మాచర్లటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి కనిపించకుండా పోయిన ఓ వివాహిత మృతదేహం సాగర్ కుడికాలువలో లభ్యమైంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎస్టీ కాలనీలో నివశించే పాలకీర్తి మహేశ్వరి పట్టణంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పని చేస్తుంది. ఈమె ఈనెల 14 ఇంటి నుంచి వెళ్లిన ఆమె కనిపించకుండా పోయిందని కుటుంబ సభ్యులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం నకరిమల్లు మండలం చేజేర్ల కుడికాలువ వద్ద ఆమె మృతదేహం లభ్యం కాగా, స్థానిక పోలీసులు మాచర్ల పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మాచర్ల పట్టణ పోలీసులు మృతదేహాన్ని సందర్శించి, పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సెల్ ఫోన్ లోకేషన్ ఆధారంగా మహేశ్వరి కారంపూడి వద్ద కుడికాలువలో దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో చోరీ నిందితులు ?

మాచర్లటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామాటాకీస్ లైన్‌లో గల ఓ నగల దుకాణంలో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 17న నగలు కొనుగోలు కోసం దుకాణంలోకి వెళ్లిన ముగ్గురు వ్యక్తులు యజమానిని మాటల్లో పెట్టి సుమారు రూ. 2 లక్షల విలువైన బంగారు గొలుసును దొంగిలించి వెళ్లిపోయారు. అనంతరం ఒక గొలుసు కనిపించలేదని గుర్తించి యజమాని సీసీ కెమెరా పరిశీలించగా, ఓ వ్యక్తి గొలుసు దొంగిలించటం రికార్డయింది. దీనిపై పట్టణ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అదే రోజునిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితుల వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నకరికల్లు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత నకరికల్లు రామదాసుకాలనీకి చెందిన బండారు ద్వారక (42) గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ద్వారక కుమార్తె ఇర్ల రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం..

దాచేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోగులపాడు- నడికూడి గ్రామాల మధ్యగల రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించి నడికూడి రైల్వేజంక్షన్ పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనపర్చుకొని విచారణ చేపడుతున్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

పిడుగురాళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాతగణేశునిపాడుకు చెందిన తేలప్రోలు శ్రీలక్ష్మీ, కోనంకి గ్రామానికి చెందిన దగ్గుల అంజిరెడ్డి, గోగిరెడ్డి వెంకట్రావమ్మ నివాస గృహాల్లో జరిగిన చోరీ కేసుల్లో నిందితుడైన కోనంకి గ్రామానికి చెందిన జంగం తిరుపతయ్యను గురువారం అరెస్టు చేసినట్లు పిడుగురాళ్ల సీఐ ఎస్ వెంకట్రావు విలేకర్ల సమావేశంలో తెలిపారు. నిందితుడి వద్ద నుండి 52 గ్రాముల బంగారం, 26 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో సిఐతో పాటు ఎస్ఐ మోహన్ తదితరులున్నారు.



హెల్మెట్లు ధరించకుండా వెళుతున్న వాహనదారులు

శిరస్త్రాణంపై.. నిర్లక్ష్యమేల?



● నవంబరు 25న గుంటూరు నగరం ఇన్నర్‌రింగురోడ్డులో ద్విచక్రవాహనంతో రోడ్డు దాటుతున్న మరొక ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. వారిద్దరూ హెల్మెట్ ధరించకపోవడంతో తల రోడ్డును బలంగా తాకడంతో అక్కడికక్కడే వారు మృతి చెందారు. హెల్మెట్ ధరించి ఉంటే ఇద్దరూ ప్రాణాలతో బయటపడే వారు.

● అక్టోబరు చివరి వారంలో గుంటూరు నగరం మిర్చియార్డు వద్ద వేగంగా వస్తున్న లారీ ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. హెల్మెట్ ధరించి ఉంటే అతడి ప్రాణాలు దక్కేవి.

● ఇటీవల ఓ ఉపాధ్యాయురాలు కుమారుడి వాహనంపై విధులకు వెళ్తుండగా ఆమె చీర బైక్ చైన్‌లో ఇరుక్కుంది. దీనిని గమనించకుండా వాహనాన్ని వేగంగా ముందుకు పోనీయడంతో ఆమె బైక్‌పై నుంచి కింద పడి అక్కడిక్కడే మృతి చెందారు. ఆమె హెల్మెట్ ధరించినట్లైతే ప్రమాదం నుంచి బయట పడేది.

- ఇలా నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పలువురు మృత్యువాత పడుతున్నారు. హెల్మెట్లు ధరించకపోవడంతోనే మరణాలు సంభవిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యంతో ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. హెల్మెట్‌లపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించేలా చర్యలు తీసుకోవాలని తామిచ్చిన ఆదేశాలను అధికారులు అమలు చేయడం లేదని హైకోర్టు ప్రస్తావించింది. దీంతో ఇతర జిల్లాల్లో అధికారులు హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధికారులు కనీసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు.

● రోజురోజుకు పెరుగుతున్న మరణాలు

● హెల్మెట్‌పై ఆసక్తి చూపని వాహనదారులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను నడపడంలో తాము నేర్పరులమని, హెల్మెట్లు అవసరం లేదని కొందరూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొంత మంది హెల్మెట్లను అడ్డంకిగా భావిస్తున్నారు. చాలామంది హెల్మెట్లను ధరించాలంటే ఆసక్తి చూప డం లేదు. కొంతమంది ద్విచక్ర వాహనదారులు తల వెంట్రుకలు రాలిపోతాయని, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయంటూ హెల్మెట్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారు. మరి కొంతమంది ద్విచక్ర వాహనాలను రూ.లక్షలతో కొనుగోలు చేసి రూ.వెయ్యి లోపు ఖర్చయ్యే హెల్మెట్‌ను కొనుగోలు చేసేందుకు వెనుకాడుతుంటారు. రోడ్డు ప్రమాదంలో కాళ్లు, చేతులు, ఇతర శరీర భాగాలు గాయపడినా బతకవచ్చు.. కానీ తలకు గాయమైతే ప్రాణానికి ముప్పు తప్పదని తెలిసి కూడా హెల్మెట్ ధరించాలన్న ఆలోచన చేయడంలేదు. మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రతి ద్విచక్ర వాహనదారుడు, అతడి వెనకాల కూర్చున్న వారు తప్పనిసరిగా విధిగా హెల్మెట్ ధరించాలి. కానీ ఈ నిబంధన సక్రమంగా అమలు కావడం లేదు. హెల్మెట్ వినియోగించాలన్న నిబంధనను అమలు చేయాల్సిన బాధ్యత పోలీసులు, రవాణా శాఖపై ఉంది. అంతకు మించి ప్రాణరక్షణ కోసం వాహనదారులు కూడా శిరస్త్రాణం ధరించాలి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. మిగిలిన సమయాల్లో కేసులు కూడా నమోదు చేయడం లేదు. దీంతో వాహనదారులు హెల్మెట్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రతి రోజు ప్రధాన కూడళ్ల వద్ద నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలను నిర్వహిస్తున్నారు. పట్టుబడితే రూ.10 వేల వరకు జరిమానా విధించి, కేసులు పెడుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, హెల్మెట్ల విషయంలో దృష్టి పెట్టడం లేదని విమర్శలున్నాయి.



● వాహనంతోనే హెల్మెట్

మోటారు వాహన చట్టం ప్రకారం ప్రతీ డీలరు వాహనం విక్రయించే సమయంలో వినియోగదారుడికి తప్పనిసరిగా హెల్మెట్ ఇవ్వాలి. నాణ్యత ప్రమాణాలతో ఉన్న ఐఎస్ఐ మార్కు కల్గిన హెల్మెట్‌నే వాహనదారులు వినియోగించాలి. అయితే నూతన ద్విచక్ర వాహనాన్ని విక్రయించేటప్పుడు వాటికి హెల్మెట్‌లను జతచేసి ఇవ్వాలనే నిబంధనను డీలర్లు అమలు చేయడం లేదు.



హెల్మెట్లు ధరించని వాహనదారులు

హెల్మెట్ తప్పనిసరి



ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలి. ధరించని వారిపై కేసు నమోదు చేసి రూ.1000 జరిమానా విధిస్తాం, రెండోసారి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తాం. రోడ్డు ప్రమాదాలను నియంత్రించే కార్యక్రమంలో భాగంగా ఎవరినీ ఉపేక్షించేది లేదు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా నిబంధనలను కఠినంగా అమలు చేస్తాం.

-సత్యనారాయణ ప్రసాద్, ఆర్టీవో, గుంటూరు

అమరావతి రైల్వేలైన్ కూత



● భూ సేకరణకు కేంద్ర గెజిట్ నోటిఫికేషన్ విడుదల

● 297.499 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్

● గొట్టుముక్కల, పరిటాలలో 122.91 ఎకరాలు

● వీరులపాడు మండలంలో 174.56 ఎకరాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అమరావతి నూతన రైల్వే మార్గానికి ముందడుగు పడింది. కేంద్ర ప్రభుత్వం తాజాగా భూ సేకరణ ప్రతిపాదనలకు సంబంధించిన గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రతిపాదిత భూ సేకరణ భూములపై ఏమైనా అభ్యంతరాలుంటే జనవరి 16లోపు తెలపాల్సి ఉంటుంది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించే నూతన రైల్వేలైన్‌కు 297.499 ఎకరాలను సేకరించేందుకు ఈ గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామంలో 50.49 ఎకరాలు, పరిటాలలో 72.42, వీరులపాడు మండలం పెద్దాపురంలో 50.92 ఎకరాలు, గూడెం మాధవరంలో 7.71 ఎకరాలు, జుజ్జూరులో 28.89 ఎకరాలు, నరసింహారావు పాలెంలో 17.44 ఎకరాలు, చెన్నారావు పాలెంలో 26.45 ఎకరాలు, అల్లూరులో 43.15 ఎకరాల చొప్పున భూ సేకరణకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రతిపాదించిన భూముల్లో నూటికి 99 శాతానికి పైగా ప్రైవేటు భూములే ఉన్నాయి. ప్రభుత్వ భూములు చాలా తక్కువ. ఒకటి రెండు దేవదాయ భూములు కూడా ఉన్నాయి. పంచాయతీల పరిధిలో చాలా స్వల్ప సంఖ్యలో పుంత, పీడబ్ల్యూడీ కెనాల్, వాగు, ఇళ్ల స్థలాలు ఉన్నాయి. పరిటాలలో సర్వే నెంబర్ 8లో సుమారు 3 ఎకరాల వరకు కోర్టు కేసులో ఉన్న భూములను కూడా భూ సేకరణలో పెట్టారు. ఈ భూములను వెంటనే సేకరించటం కుదరదు. కోర్టు కేసులు తేలితే తప్ప సేకరించలేని పరిస్థితి. ఇవికాకుండా పలుచోట్ల డొంకలు కూడా భూ సేకరణలో ఉన్నాయి. పరిటాలలో సర్వే నెంబర్ 13లో ఎన్‌హెచ్ రోడ్డుకు సంబంధించిన భూమిలో 82 సెంట్ల మేర కోల్పోవాల్సి వస్తుంది. ఒకటి రెండుచోట్ల మాత్రమే అసైన్డ్ ల్యాండ్స్‌ను తీసుకోవాల్సి వస్తోంది.

పరీక్షా కాలమ్



భయం వీడితే
ఆంగ్లంలో అత్యధిక మార్కులు

● సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సన్నద్ధం కావాలి

● పది విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయురాలు పద్మ సూచనలు



పమిడిమర్రి పద్మ, జడ్పీ ఉన్నత పాఠశాల, వెనిగండ్ల, గుంటూరు

గుంటూరు(విద్య), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం (2024-25) నూతనంగా అమల్లోకి వచ్చిన ఎన్‌సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలకు అనుగుణంగా ఆంగ్లం బ్లూ ప్రింట్‌లో చిన్న చిన్న మార్పులు చేశారు. గతంలోలాగే మూడు సెక్షన్లతో 100 మార్కుల ప్రశ్నపత్రాన్ని ప్రవేశపెట్టారు. ప్రశ్నల సంఖ్యను 34 నుంచి 37కు పెంచారు. భయం వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధమైతే ఆంగ్లభాషలో అత్యధిక మార్కులు తెచ్చుకోవచ్చు. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించిన తర్వాత విద్యార్థులు తాము సొంతంగా లైన్ బై లైన్ చదివి అర్థం చేసుకోవాలి.. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పరీక్షలకు సన్నద్ధం కావాలని.. పెదకాకాని మండలం వెనిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు పమిడిమర్రి పద్మ విద్యార్థులకు సూచించారు.

- ప్రశ్నపత్రం సెక్షన్ ఏలోని రీడింగ్ కాంప్రహెన్షన్‌లో ఈ సారి ప్రోజ్ లెసన్‌తోపాటు పోయమ్, సప్లిమెంటరీ రీడర్‌కు గతంలో కంటే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. ఇందులో 20(10+5+5) మార్కులకు 20 మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంది.
- ఇందులో ప్రశ్న నెంబరు 16 స్టడీ స్కిల్స్‌లో పైచార్ట్, బార్ డయాగ్రమ్స్, ట్రీ డయాగ్రమ్స్, టేబుల్స్ రూపంలో సమాచారాన్ని ఇచ్చి దానిమీద ప్రశ్నలను అడుగుతారు. ఈ అంశాలపై కొంచెం శ్రద్ధ పెట్టి సాధన చేస్తే బీలో యావరేజ్ స్టూడెంట్స్ కూడా 5 మార్కులను సులభంగా సాధించగలరు.
- 17వ ప్రశ్నలో ఒక కథను, సంఘటనను లేదా జీవిత చరిత్రను ఇచ్చి దానిపై క్రోనోలాజికల్ ఆర్డర్‌లో అరెంజ్ చేయమని అడుగుతారు. ఇలాంటి వాటిని 10 నుంచి 20 వరకు ప్యాసేజి సాధన చేస్తే 5 మార్కులను సులభంగా సాధించవచ్చు.
- సెక్షన్ బీలో ఈ సారి కొత్తగా 22వ ప్రశ్న కింద ఎడిటింగ్‌ను ప్రవేశపెట్టారు. వర్కుబుక్‌లో ఇచ్చిన ఎడిటింగ్‌ను సాధన చేస్తే 4 మార్కులను రాబట్టవచ్చు.
- పాస్ట్ హ్యాబిట్స్ లేదా స్టేటస్‌ను తెలియజేసే వాక్యంలో would లేదా used toను ఏ సందర్భంలో ఉపయోగించాలి అనే విషయంపై అవగాహన కలిగి ఉంటే రెండు మార్కులు సులభంగా వస్తాయి.
- noun modifiers అనే అంశాన్ని కూడా ఈసారి కొత్తగా ప్రవేశపెట్టారు. వకాబలరీ కింద అడిగే phrasal verb, idioms, matchingలో పూర్తి స్కోర్‌ను సాధించాలంటే పాఠ్య పుస్తకాలలో యూనిట్ల వారీగా ఇచ్చిన వాటిని సాధన చేస్తే మంచిది.
- సెక్షన్ డీ 35వ ప్రశ్న కింద conversation ను గతంలో లాగే prose lessons కు మాత్రమే పరిమితం చేయకుండా సప్లిమెంటరీ రీడర్‌కు కూడా అనుసంధానించారు. కాబట్టి విద్యార్థులు prose lessons, సప్లిమెంటరీ రీడర్‌లోని ప్రతి క్యారెక్టర్‌ను అధ్యయనం చేసి ఉండాలి.
- లెటర్ రైటింగ్, స్పీచ్ స్క్రిప్ట్ తయారీలో ప్రారంభం, ముగింపులో కామన్‌గా ఉండే అంశాలను సాధన చేసి, ప్రశ్నపత్రంలో ఇచ్చిన ఇన్‌పుట్స్ నుంచి ప్రధాన సారాంశాన్ని రాసి జోడిస్తే తక్కువ సాధనతో ఎక్కువ మార్కులను ప్రతి ఒక్కరు సులభంగా సాధించగలుగుతారు.
- చివరి ప్రశ్న 37లో సప్లిమెంటరీ రీడర్ నుంచి ఒక ప్యాసేజ్‌ను తీసుకుని అందులో అండర్ లైన్ చేసిన అంశాలకు అనుగుణంగా ప్రశ్నలను తయారు చేయాలి. ఈ ప్రశ్నలను వ్యాకరణ దోషం లేకుండా రాస్తే 10 కి 10 పూర్తి మార్కులను సాధించగలుగుతారు.
- సెక్షన్ సీ కింద అడిగే క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్స్‌కి ఇంటర్నల్ చాయిస్ ఉంటుంది. సులువుగా అనిపించే అంశాన్ని ఎంచుకుని సాధన చేస్తే మంచి మార్కులు సులభంగా సాధించే అవకాశాలున్నాయి.

టీడీఆర్ బాండ్లపై.. విజిలెన్స్

(5వ పేజీ తరువాయి)

ఫీజులు చెల్లించకుండానే నేతల ఒత్తిడి మేరకు ప్లాన్లను అధికారులు మంజూరు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక అనధికారిక నిర్మాణాలకు లెక్కేలేదని సమాచారం. వాటికి రెవెన్యూ పరంగా పన్నులు కూడా సక్రమంగా విధించలేదని తెలుస్తుంది. ఇలా అనేక అంశాలపై రెండు నగర పాలక సంస్థలు, 14 మున్సిపా లిటీలలో విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారు. ఆయా రికార్డులను తెప్పించుకుని పరిశీలిస్తున్నారు. గుంటూరు జిల్లా విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణకుమార్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు ప్రత్యేక టీములుగా ఏర్పడి మున్సిపాలిటీల్లో క్షేత్రస్థాయిలో దర్యాప్తు ప్రారంభించారు. రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తున్నారు.

గుంటూరులో భారీ స్కాం..

గుంటూరులో నకిలీ టీడీఆర్ బాండ్లు, నకిలీ చలనాల కుంభకోణం గతంలో జరిగింది. దీనిపై దర్యాప్తు జరుగుతుండగానే 2022లో మరో స్కాంకు వైసీపీ నాయకులు, అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారి తెర తీశారు. పెదకాకాని రోడ్డులోని బెస్ట్‌ప్రైస్ నుంచి జాతీయ రహదారి వరకు వయా పందులకాలనీ మీదుగా రోడ్డు విస్తరణకు టౌన్‌ప్లానింగ్ అధికారులు శ్రీకారం చుట్టారు. రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయే బాధిత రైతులకు మస్కా కొట్టి టీడీఆర్ బాండ్లు జారీ చేసి కుంభకోణానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో తక్కెళ్లపాడుకు చెందిన రైతులను ఒప్పించేందుకు అధికారులు ప్రయత్నించగా వ్యవహారం బెడిసికొట్టింది. అక్రమ బాండ్లకు తాము ఒప్పుకోమంటూ రైతులు నగరపాలక సంస్థ అధికారులకు ఎదురుతిరిగారు. దీంతో రూ.300 కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణం వెలుగుచూసింది. అప్పటి నుంచి రైతులకు వాస్తవంగా అందించాల్సిన టీడీఆర్ బాండ్లను కూడా ఇవ్వలేదు. దీనిపై కూడా విజిలెన్స్ అధికారులు నగర పాలక సంస్థలో తనిఖీలు చేపట్టారు.

● జీఎంసీలో 99వ బ్యాచ్ వేడుకలో ఎన్నారై డాక్టర్ పాదిల ప్రసాద్

సంస్థ రుణం తీర్చుకోవడం హర్షణీయం

గుంటూరు(మెడికల్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పించి సమాజంలో ఉన్నత వైద్యులుగా తీర్చిదిద్దిన గుంటూరు వైద్య కళాశాల రుణం తీర్చుకునేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం హర్షణీయమని ఎన్నారై డాక్టర్ పాదిల ప్రసాద్ తెలిపారు. గురువారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో 1999వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సిల్వర్‌జూబ్లీ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలో అతితక్కువ ఖర్చుతో వైద్య విద్య చదివే విద్యార్థులు భవిష్యత్తులో తాము వైద్యులుగా స్థిరపడిన తర్వాత మాతృసంస్థ రుణం తీర్చుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 99వ బ్యాచ్ విద్యార్థులు వైద్య కళాశాలకు రెండు బస్సులను విరాళంగా ఇవ్వడం సంతోషదాయకమన్నారు. సిల్వర్ జూబ్లీ వేడుకల్లో కలిసిన వారంతా ఒకరినొకరు ఆప్యాయయంగా పలుకరించుకుంటూ సందడిగా, ఆటపాటలతో గడిపారు. మహిళా వైద్యులు సంప్రదాయబద్ధంగా చీరలు ధరించి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రం అమరావతిరోడ్‌లోని కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో తమకు వైద్య పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు.

కోటి రూపాయల విరాళం ప్రకటన

1999వ బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ సందర్భంగా కళాశాలకు కోటి రూపాయలు విరాళం ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ బ్యాచ్ విద్యార్థులు రూ.75 లక్షలతో రెండు కొత్త బస్సులను విరాళంగా ప్రకటించారు. ఇందులో భాగంగా గురువారం ఒక బస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారికి అందజేశారు. కళాశాల గ్రంథాలయంలో ఆధునీకరణకు అయ్యే ఖర్చును భరించేందుకు సుసిద్ధత వ్యక్తం చేశారు. అమరావతి రోడ్డులోని జీఎంసీ మెన్స్ హాస్టల్‌లో రూ.8 లక్షలతో రెండు క్రికెట్ పిచ్‌లను కొత్తగా ఏర్పాటు చేయించారు. వైద్య విద్యార్థుల వసతి గృహంలో రెండు వాషింగ్ మెషిన్లను, వాలీబాల్ కోర్టు నెట్లను, క్రికెట్ కిట్లను అందజేశారు. మిగిలిన మొత్తాన్ని కూడా త్వరలో ఇతర అభివృద్ధి పనుల కోసం విరాళంగా అందజేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమానికి 99వ బ్యాచ్‌కు చెందిన న్యూరోసర్జన్ డాక్టర్ భవనం హనుమా శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పుణ్యాల శ్రీనివాసరెడ్డి సంధానకర్తలుగా వ్యవహరించారు.



జీఎంసీలో కలిసిన 99వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

జూనియర్ కళాశాలల్లో.. నిబంధనలకు తూట్లు

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తుచేసిన ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆయా కళాశాలలకు నోటీసులు జారీ చేసి పెద్దమొత్తంలో జరిమానా విధించినట్లు తెలిపారు.

నగరం, పట్టణాల్లోనే అత్యధిక ఉల్లంఘనలు....

ఒకచోట అనుమతి తీసుకుని మరొక చోట తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలు గుంటూరు, మున్సిపల్ పట్టణాల్లో అత్యధికంగా ఉన్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. గతంలో ఇలాంటి 15 కళాశాలల్ని ఒక్కో కళాశాలకు రూ. 2.50లక్షల చొప్పున జరిమానా విధించారు. మరోవైపు అనుమతి లేకుండా కళాశాలల్ని నిర్వహిస్తున్న విషయం కూడా వెలుగులోని రావడంతో ఆయా కళాశాలలకు రూ. 5లక్షల వరకు జరిమానా విధించారు. నగరంలో ఒక చోట కళాశాలకు అనుమతి తీసుకుని మేడికొండూరు, చినపలకలూరు, పెదపలకలూరు, నల్లపాడు శివారు, చల్లావారిపాలెం, గోరంట్ల తదితర ప్రాంతాల్లో కళాశాలల్ని నిర్వహిస్తున్నారు. అసలు 90శాతంపైగా ప్రైవేటు కళాశాలలకు ఆటస్థలాలు లేవని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. నగరంలోని అపార్టుమెంట్స్‌లో భారీగా అద్దెలు పెరగడం,నీరు ఇతర అవసరాల దృష్ట్యా కళాశాలల్ని శివారు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇటువంటి కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు పడినప్పుడు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్ ప్రయోగ పరీక్షలు, థియరీ పరీక్షల కేంద్రాలను నిలిపివేశారు. దీంతో కొత్తచోట గుర్తింపు వచ్చిన తరువాతే సంబంధిత కళాశాలలకు కేంద్రాలు కేటాయిస్తామని ఇంటర్ బోర్డు అధికారులకు స్పష్టం చేసినా తాజాగా షరామామూలుగానే కళాశాలలు వ్యవహరిస్తున్నాయి.

ఇంటర్ బోర్డు నిబంధనలు ఇలా....

ఒక కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించాలంటే అనేక నిబంధనలు ఉన్నాయి. ముందుగా ప్రభుత్వం కళాశాలకు మంజూరు చేసిన గుర్తింపు ఉత్తర్వులు చూపాలి. దీనితోపాటు అనుబంధ గుర్తింపు పత్రం అందజేయాలి. కళాశాలకు కట్టిన కార్పస్‌ఫండు కాపీని ఇవ్వాలి. అంతేకాకుండా కళాశాలను తరలించేందుకు కారణాలు సూచిస్తూ కళాశాల గవర్నింగ్‌బాడీ తీర్మానం ఉండాలి. తరలించేందుకు ఒక్కో కళాశాల పట్టణ ప్రాంతాల్లో అయితే రూ. 27వేలు, గ్రామీణ ప్రాంతంలో అయితే రూ.12వేలు ప్రభుత్వానికి చెల్లించాలి. భూమి భవనాలు, ఆటస్థలం, ప్రయోగశాల, అగ్నిమాపక ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. అదేవిధంగా మెడికల్ అధికారి జారీచేసిన శానిటరీ ధ్రువీకరణ పత్రం, మున్సిపల్, కార్పొరేషన్, గ్రామీణ ప్రాంతాల నుంచి ఎన్‌వోసీ మంజూరు చేయాలి ఇలా అనేక నిబంధనలు కళాశాల మార్పు సమయంలో పాటించాలని ఇంటర్ బోర్డు నిబంధనలు చెబుతున్నాయి. ఇవేవి పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా కళాశాలల్ని నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంటర్ బోర్డు అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేస్తేనే విషయం బహిర్గతమౌతుందని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి.

నదిలో రోడ్డు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● కాంట్రాక్టర్లకు హెచ్చరికలు జారీ చేసిన తహసీల్దారు

అచ్చంపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనూరు వద్ద కృష్ణా నదిలో ఇసుక తరలింపు కోసం వేసిన రోడ్డును గురువారం తహసీల్దార్ కే శ్రీనివాస్ తొలగించారు. గురువారం ఆంధ్రజ్యోతిలో నదిలోనే రోడ్డు అనే శీర్షికతో ప్రచురిత మైన వార్తకు స్పందించిన తహసీల్దారు నదిలో ప్రవాహానికి అడ్డుగా వేసిన తూములను తొలగించారు. కోనూరు వద్ద నదిలో ఇసుక కాంట్రాక్టర్లు కిలో మీటరున్నరకు పైగా వేసిన తూములను తొలగించారు. అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్లు, కాంట్రాక్టర్‌కు చెందిన ఏ వాహనమైనా నదిలోకి వస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బందిని కృష్ణా నది వద్ద కాపలా ఉంచుతున్నట్లు తహసీల్దారు తెలిపారు. నదిలో రోడ్డు వేసే అధికారం ఎవ్వరికీ లేదని కాంట్రాక్టర్లను హెచ్చరించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వరి కోతలు వద్దు: ఏవో అబ్బూరి అంకారావు

బొల్లాపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కోతలు, నూర్పిళ్ళు ముమ్మరంగా జరుగుతున్నందున వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మూడు రోజుల పాటు బొల్లాపల్లి మండలంలో వరి కోతలు కోయవద్దని వ్యవసాయశాఖ అధికారి అబ్బూరి అంకారావు గురువారం తెలిపారు. తుఫాన్ కారణంగా వరి పంట కోసినట్లయితే నీట మునిగి పంట నష్టపోయే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వరి కోత నూర్పిళ్ళు నిలిపివేయాలని పిలుపునిచ్చారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రం అందచేత

చిలకలూరిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కవల పిల్లలకు అత్యవసర వైద్యం నిమిత్తం స్థానిక వరలక్ష్మి ఆసుపత్రి వారికి సీఎం సహాయనిధి నుంచి రూ.3లక్షలకు మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అందచేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు గోపిదేశి త్రివేణి, హరికృష్ణ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు: కమిషనర్

వినుకొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోడ్డు ప్రమాదాల నివారణకు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సూచనలు మేరకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ గురువారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో పట్టణ సీఐ శోభన్‌బాబు, వెటర్నరీ వైద్యులు శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టరు ఇస్మాయిల్‌తో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లపై సంచరిస్తున్న అదుపులోకి తీసుకున్నామని, వీటిని శనివారం చిలకలూరిపేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ధర్మసంఘం గోశాలకు తరలిస్తామన్నారు. కొందరు ఆవుల యజమానులు చలానా చెల్లించి కొన్ని ఆవులు తీసుకువెళ్ళగా, 14 ఆవులు మున్సిపల్ ఆధీనంలో ఉన్నాయన్నారు. సీఐ శోభనబాబు మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు ఇప్పటికే రోడ్లపై వాహనాలను నిలిపుతున్న యజమానులకు హెచ్చరికలు జారీచేశామని, రోజుల తరబడి నిలిపిన వాహనాలకు తాళాలు వేశామన్నారు. ఇకనుంచి వాహనాలను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలిస్తామన్నారు. వాహన యజమానులు పట్టణంలోని ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండ పోలీసులకు సహకరించాలన్నారు.

అసభ్య పోస్టులు పెడుతున్న ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

వినుకొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలువురు ఎమ్మెల్సీలపై జుగుప్సాకరమైన, అసభ్యకరమైన పదజాలంతో పోస్టులు పెడుతున్న ఓ ఉపాధ్యాయుడిపై నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ప్రాథమిక పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మన్నం శ్రీనివాస్ గత కొంతకాలంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ సీహెచ్ సుభాష్ చంద్రబోస్, మాజీ ఉద్యోగ జేఏసీ చైర్మన్ ప్రస్తుత ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావులపై అభూతకల్పనలతో పోస్టింగ్‌లు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడంటూ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన పట్టణ సీఐ అశోక్‌బాబు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సౌత్‌జోన్ మహిళా ఖోఖో పోటీలకు కృష్ణవేణి డిగ్రీ విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ అంతర కళాశాల మహిళా ఖోఖో పోటీలలో స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏఎన్‌యూ మహిళా ఖోఖో జట్టును ఎంపిక చేశారన్నారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన కే విశాలాక్షి, బీ అలేఖ్య, ఎం.హేమలత, ఎం చౌడేశ్వరిలను జట్టుకు ఎంపిక చేశారన్నారు. కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో జరిగిన దక్షిణ భారత విశ్వవిద్యాలయాల పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, పీడీ ఈదర ఆదిబాబు, కోచ్ ఎస్‌కే మహమ్మద్ అభినందించారు.

సౌత్ జోన్ యోగా పోటీలకు ఎన్ఈసీ విద్యార్థులు

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ యోగా పోటీలకు మండలంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాలలో ట్రిపుల్‌ఈ విభాగంలో నాలుగో సంవత్సరం చదువుతున్న డి.నాగాంజలి, సీఎస్‌ఈ రెండో సంవత్సరం చదువుతున్న సీహెచ్ మారుతీ శ్రీనివాసరావులు సౌత్ జోన్ యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 3, 4 తేదీలలో కాకినాడ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో జరిగిన జేఎన్‌టీయూకే అంతర కళాశాలల యోగా సెలక్షన్ ట్రైల్స్‌లో వీరిద్దరు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా వీరు ఈ నెల 24 నుంచి 28 వరకు కిస్ యూనివర్శిటీ, భువనేశ్వర్‌లో జరిగే అఖిల భారత అంతర కళాశాలల యోగా పోటీలకు జేఎన్‌టీయూకే నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఏఎన్‌యూ అంతర కళాశాలల అథ్లెటిక్స్‌లో ఎస్ఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ అంతర కళాశాలల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ గురువారం తెలిపారు. సీహెచ్‌వీఎం గురుశంకర్ 200, 400 మీటర్ల పరుగులో బంగారు పతకాలు సాధించాడన్నారు. ఎస్.లాజర్ 800, 1500 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించారని అన్నారు. సీహెచ్‌వీఎంజీ శంకర్, ఎస్.లాజర్, ఎం.దుర్గాసాయి, వై.చరణ్ కుమార్‌లు 4/400 మీటర్ల రిలే పరుగులో కాంస్య పతకం సాధించారని తెలిపారు.

అధ్వానంగా మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్

● ఇబ్బందులు పడుతున్న లీజుదారులు ● మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి

వినుకొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ వర్షం తాకిడితో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంప్లెక్స్ పైన గత కొన్నేళ్ళుగా భారీగా వృక్షం పెరిగినా తొలగించకపోవడంతో వాటి వేర్లు షాపుల్లో ప్రవేశించాయి. చిన్నపాటి వర్షం కురిసినా వేర్ల ద్వారా షాపుల్లోకి నీరు రావడంతో షాపు యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపారులకు సరైన సౌకర్యాలు కల్పించకుండానే క్రమం తప్పకుండా అద్దెలు వసూలు చేయడంపై షాపు యజమానులు మున్సిపల్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాషువా కళాప్రాంగణం పక్కనే ఉన్న ఓ బ్యాటరీ షాపులో షాపు పైభాగం నుంచి వేర్లు పెద్దఎత్తున గోడలకు అల్లుకుపోయాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసిన నీరు షాపుల్లోకి ప్రవేశించి షాపుల్లోని ఖరీదైన సామగ్రికి నష్టం వాటిల్లుతున్నట్లు షాపు యజమాని వాపోయారు. అధికారులు స్పందించి షాపింగ్ కాంప్లెక్స్‌పై ఉన్న పాతుకుపోయిన చెట్లను తొలగించి మరమ్మతులు చేపట్టాలని షాపు యజమానులు కోరుతున్నారు.



మున్సిపల్ కాంప్లెక్స్ షాపుల్లోని గోడలకు అల్లుకుపోయిన చెట్టు వేర్లు, కాంప్లెక్స్‌పై పెరిగిన భారీ వృక్షం

కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలంటూ నిరసన

చిలకలూరిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలంటూ పలు సంఘాల నాయకులు గురువారం ఇక్కడ డిమాండ్ చేశారు. స్థానిక నరసరావుపేట సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బి శ్రీను నాయక్, టి శ్రీనివాసరావు, కె నాగేశ్వరరావు, ఎస్ నాగరాజు, రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ అమిత్‌షా స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని,



చిలకలూరిపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

లేకుంటే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందచేశారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె కోటేశ్వరరావు, పార్టీ నాయకులు ఎం ప్రసన్న, అనిల్ కుమార్, నాగాంజనేయులు పాల్గొన్నారు. కాగా అమిత్ షా రాజీనామా చేయాలంటూ పల్నాడు జిల్లా వీసీకే పార్టీ ప్రధాన కార్యదర్శి వంజా ముత్తయ్య డిమాండ్ చేశారు. సామాజికవేత్త కొచ్చర్ల చందు అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాల మహానాడు, ఎంఐఎం, ప్రజా సంఘాల నాయకులు

అంబేద్కర్‌ను అవమానిస్తే భారీ మూల్యం తప్పదు: గోదా జాన్ పాల్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌ను అవమానిస్తే ఎవరైనా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ అన్నారు. గురువారం నరసరావుపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్ పేరు అన్నిసార్లు మాట్లాడటం కంటే దేవున్ని తలుచుకుంటే స్వర్గానికైనా వెళతారంటూ హేళనగా మాట్లాడారన్నారు. అంబేద్కర్ వాదులను అవమానించడం, భారత రాజ్యాంగం రాసిన వ్యక్తికి బీజేపీ నాయకులు ఇచ్చే గౌరవం ఇదేనా అన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా తక్షణమే అంబేద్కర్ పాదాలు పట్టుకుని కోట్లాది భారతీయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నియోజకవర్గ వర్కింగ్ అధ్యక్షుడు ఉస్తేలా జయరావు, ఎంఐఎం నాయకుడు షేక్ మౌలాలి, జన జాగృతి మహిళా మండలి అధ్యక్షురాలు పిడదల రమాదేవి, ముస్లిం మైనారిటీ ఐక్య వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షకీలా, మెడబలిమి సాంబశివ, బేబి ఫౌండేషన్ జూలూరి రమేష్, ఉన్నం శ్రీను, బూదాటి సంసోను,కాకి చార్లీ ,కీర్తిపాటి ప్రసన్న, మందాది చిన్న, వాసుపల్లి సాంబ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాపురంలో భూముల రీ సర్వే ప్రారంభం

నూజెండ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని త్రిపురాపురం రెవెన్యూ గ్రామంలో భూముల రీ సర్వేను తహసీల్దార్ జీ రమేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యలకు రీ సర్వే ద్వారా శాశ్విత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ చండీరాణి, సర్పంచ్ గొట్టం బ్రహ్మారెడ్డి, వీఆర్‌వో యోగయ్య, విలేజ్ సర్వేయర్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కుంటా కోటిరెడ్డి, మాదాల యలమంద, జెక్కిరెడ్డి అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ తహసీల్దార్‌కు వినతి

రొంపిచర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని తహసీల్దార్ బండి నిర్మలకు అందజేశారు. సబ్ స్టేషన్ సమీపంలోని హైవే వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, రొంపిచర్లలోని 6వ వార్డులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, మండలంలో ప్రజా పంపిణీ సరఫరా వాహనాల ద్వారా జరగాలని, భూ యజమాని చనిపోతే వారసులకు పట్టాదారు పాసు పుస్తకాలు నిబంధనలు లేకుండా ఇవ్వాలని, పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటేశ్వరరాజు, పలపల రామిరెడ్డి, ఆకుల కోటేశ్వరరావు, గోవిందు, సరికొండ ఏడుకొండల రాజు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అదనపు జిల్లా కోర్టు ఏజీపీగా సీతారామాంజనేయులు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక 13వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ గవర్నమెంట్ న్యాయవాదిగా పట్నానికి చెందిన కే సీతారామాంజనేయులును నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణానికి చెందిన సీతారామాంజనేయులు న్యాయ శాస్త్ర విద్యాభ్యాసానంతరం 1999లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్లో నమోదయ్యారు. పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది దివంగత నడింపల్లి వెంకట అప్పారావు వద్ద జూనియర్ న్యాయవాదిగా పనిచేశారు. గతంలో సీతారామాంజనేయులు సబ్ కోర్టు ఏజీపీగా సేవలందించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

రొంపిచర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి జరుగుతున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. సూపరింటెండెంట్ లక్ష్మీకుమారి హాజరైన వారికి పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి గురించి వివరించారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ వర్కర్లు, వీవోఏలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి మోడల్ పేపర్లు పంపిణీ

రొంపిచర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు గురువారం పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు సహకారంతో 20 మోడల్ పేర్లతో ఉన్న 160 పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.

అర్బన్ పోలీస్ స్టేషన్లో డీఎస్పీ వార్షిక తనిఖీలు

చిలకలూరిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట డీఎస్పీ కె నాగేశ్వరరావు గురువారం చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. శాంతి భద్రతలకు సంబంధించి పలు సూచనలు చేశారు. అర్బన్ సీఐ రమేష్, ఎస్ఐలు చెన్నకేశవులు, రహంతుల్లా, శివరామకృష్ణ పాల్గొన్నారు.



చిలకలూరిపేట అర్బన్ పోలీస్టేషన్లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు చిలకలూరిపేట విద్యార్థులు

చిలకలూరిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాందేడ్‌లో వచ్చే నెల 15 నుంచి 18 వరకు జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ అండర్ 19 విభాగం పోటీలో పాల్గొనే జట్టులో స్థానిక ఏఎంజీ స్కూల్ విద్యార్థులు గుంజి చరణ్, ధూపాటి నాగచైతన్య క్రీడాకారులుగా ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ కంటిమహంతి, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్ తదితరులు అభినందించారు.



జాతీయ స్కూల్ గేమ్స్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైన చరణ్, నాగచైతన్య

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

నరసరావుపేట లీగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం తెల్లవారుజామున పట్టణంలోని పెద్ద చెరువులో చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పెద్ద చెరువులోని ఏడవ లైనుకు చెందిన ఇర్ల శంకర్ (17) సిమెంట్ పని చేసి జీవిస్తుంటాడు. గురువారం తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో ఇంటి నుంచి టీ తాగడానికి పల్నాడు బస్టాండ్‌కు వస్తుండగా కలెక్టర్ బంగ్లా సమీపంలో విద్యుత్ వైరు తెగి కిందపడి ఉంది. శంకర్ వైర్‌ను తీసి పక్కన పెట్టడానికి ప్రయత్నించగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో శంకర్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించి రూ.పది లక్షలు నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలంటూ రైతుల ధర్నా

నరసరావుపేట టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే, ఎల్పీ నంబర్లు రద్దు చేసి స్థానిక సర్వేయర్ కోమటినేని రామాంజనేయులుపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని జొన్నలగడ్డ సచివాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎం నాయకుడు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, గత ప్రభుత్వం ఇచ్చిన పాస్ పుస్తకాలను రద్దు చేశారని అన్నారు. రీ సర్వే, ఎల్‌పీ నంబర్లు వేయకపోవడం వలన రైతులకు రెవెన్యూ వాళ్ల గతంలో చేసిన అన్యాయం నేటికీ పరిష్కారం అవ్వలేదన్నారు. జొన్నలగడ్డలో వంద మందికి పైగా రైతులకు భూములు తగ్గాయని, ఒకరి భూములు ఒకరికి నమోదు చేశారని అన్నారు. రీ సర్వే రద్దుచేసి, ఎల్‌పీ నంబర్లు రద్దు చేయాలని, అక్రమాలకు పాల్పడిన సర్వేయర్ కోమటినేని రామాంజనేములుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రం వెంకటేశ్వర్లు, ఉప్పుటూరు రామోహనరావు, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, ఉప్పుటూరి బాబు, శివరామకృష్ణయ్య, బీసీ సంఘం నాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు, జీ రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ కోటనాయ్, చికినం చిన్న తదితరులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్

చిలకలూరిపేట, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను ప్రత్తిపాటి కట్ చేశారు. దైవజనులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ క్రీస్తు బోధనలు సమాజాభివృద్ధికి, శాంతిస్థాపనకు దోహదం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి, జనసేన నేత తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సదా శివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, కొండా వీరయ్య, పిల్లి కోటి, వెంగళరాయుడు, పార్టీ నాయకులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల జాతీయ దినోత్సవం

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎం.సుభాని, మాజీ జిల్లా సైన్స్ అధికారి ఎ.ఎ. మధుకుమార్, పల్నాడు జిల్లా సైన్స్ అధికారి ఎస్.రాజశేఖర్, ఎన్‌జీసి కోఆర్డినేటర్ షేక్ ఆయేషా సుల్తానా, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు చిట్టెమ్మ, టి.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వాగ్దేవి డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ నరసరావుపేటలోని రావిపాడు రోడ్డులో ఉన్న వాగ్దేవి డిగ్రీ కళాశాలలో గురువారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. గ్రూప్ డిస్కషన్, జామ్, హెచ్ఆర్ రౌండ్స్ నిర్వహించి, 126మంది విద్యార్థులను ఫాక్స్‌కామ్, సచినడేర్, హెచ్‌డీఆర్ కంపెనీలలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేశారు. శిక్షణ పూర్తియిన తర్వాత నెల రూ.16,400లు వేతనంగా అందజేస్తారని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాదు అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, అధ్యాపకులు అభినందించారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి

● రోల్ అబ్జర్వర్ సూర్యకుమారి


యడ్లపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలలో మార్పులు, చేర్పులతోపాటు అందుకు సంబంధించిన రికార్డులను సక్రమంగా ఎలాంటి దోషాలు లేకుండా నిర్వహించాలని రోల్ అబ్జర్వర్ సూర్యకుమారి ఆదేశించారు. గురువారం యడ్లపాడులో పర్యటించిన ఆమె గ్రామంలోని తొమ్మిది పోలింగ్ స్టేషన్‌ల బీఎల్వోలతో సమావేశం నిర్వహించి పోలింగ్ బూత్‌ల వారీగా రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, క్లెయిమ్‌ల పరిష్కారంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఆమె వెంట నరసరావుపేట ఆర్డీవో మధులత, తహసీల్దార్ విజయశ్రీ, డీటీ అనూరాధ తదితరులు ఉన్నారు.



వినుకొండ తహసీల్దార్ కార్యాలయం, నడిగడ్డలో హద్దురాళ్ళపై జగన్ బొమ్మలను తొలగిస్తున్న కూలీలు

హద్దు రాళ్ళపై జగన్ బొమ్మల తొలగింపు

వినుకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రీసర్వే హద్దురాళ్ళపై వేసిన తన చిత్రం, పేర్లను మిషన్ల సాయంతో తొలగిస్తున్నారు. కంచర్ల, నడిగడ్డ, నీలగంగవరం, కొప్పుకొండ, తదితర గ్రామాలతోపాటు వినుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న రాళ్ళపై ఫొటోలను తుడిపివేసి రైతు పొలాలకు అవసరమైన రాళ్ళను అందజేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రీసర్వే హద్దురాళ్ళపై తన ఫొటో, పేర్లు వేయించుకొని పెద్ద ఎత్తున గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి రాళ్ళను దిగుమతి చేసుకున్నారు. సర్వే అధికారులకు అందుబాటులోఉండేలా మండలంలోని ప్రధాన గ్రామాల్లో రాళ్ళను రాసులుగా ఏర్పాటు చేశారు. అయితే భూముల సరిహద్దు రాళ్ళపై జగన్ ఫొటో ఉండడంపై పలువురు రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం కావటంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జగన్ చేసిన తప్పిదాలను చక్కదిద్దేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ప్రభుత్వం అందిస్తున్న పాసు పుస్తకాలపై జగన్ ఫొటో బదులు ప్రభుత్వ రాజ ముద్రను ముద్రించి రైతులకు పాసు పుస్తకాలను పంపిణీచేస్తున్నారు. కూటమి ప్రభుత్వ చర్యలతో పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పాత హద్దు రాళ్ళు, బొమ్మలను తొలగించిన అనంతరం హద్దు రాయి

తుఫాన్ వాహనం, ట్రక్ ఢీ.. పలువురికి స్వల్ప గాయాలు

వినుకొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సరుకులు రవాణా చేసే ట్రక్, ప్రయాణికులతో వెళుతున్న తుఫాన్ వాహనం ఢీకొన్న సంఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లె సమీపంలో లయోలా స్కూల్ వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వినుకొండ నుంచి గుంటూరు వైపు ప్రయాణికులతో వెళ్తున్న తుఫాన్ వాహనం ఎదురుగా వస్తున్న సరుకుల ట్రక్‌ను ఢీకొంది. ప్రమాదంలో తుఫాన్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన ప్రాంతానికి వెళ్ళి క్షతగాత్రులను ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం వారు స్వగ్రామాలకు వెళ్లిపోయారు. అనంతరం పోలీసులు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బాల్య వివాహాలను నిరోధించాలి: ఎంపీడీవో

నాదెండ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో ఎస్.స్వరూపరాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గడిచిన నాలుగు రోజులుగా సుస్థిరాభివృద్ధి అనే అంశంపై జరుగుతున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి, ఎంఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నాదెండ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిరుమామిళ్ళలో యానాది సామాజిక వర్గానికి చెందిన వ్యవసాయ భూమిని ఆక్రమించుకున్న వైసీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బీ శ్రీను నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వైసీపీ నేతల ఆక్రమణలో ఉన్న వ్యవసాయ భూములను ఆయనతో పాటు దళిత సంఘం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన 13ఎకరాల 40 సెంట్ల వ్యవసాయ భూమిని గ్రామానికి చెందిన వైసీపీ నేత సింగారెడ్డి కోటిరెడ్డి, ఆయన కుమారులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో మాజీ మంత్రి విడదల రజిని అండదండలతో ఆ భూమిని కౌలుకు ఇచ్చి నేతలు అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆక్రమణలపై రెవెన్యూ విచారణ చేపట్టడంతో ఎస్టీ వర్గాలకు చెందిన వారిని బెదిరిస్తున్నారని, వారి భూమిని వారికి ఇచ్చేలా న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసు, రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. అతనితో పాటు ఏసురాజు, ప్రత్తిపాటి, రాంబాబు నాయక్ తదితరులు ఉన్నారు.

2900 మంది చిన్నారులకు హెచ్‌బీఎల్ సేవలు

నాదెండ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో తమ కంపెనీ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 2900మంది చిన్నారులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ మేనేజర్ గుత్తా రాజేష్ అన్నారు. మండలంలోని ఇర్లపాడులో అంగన్‌వాడీ కేంద్రాలకు సేవలు ప్రారంభించి ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఐదు గ్రామాల్లో 18 అంగన్ వాడీ కేంద్రాలకు చెందిన పిల్లలకు పౌష్టికాహార కింద అరటి పండు, చిక్కీలు, డ్రై ఫ్రూట్స్ ప్రతి రోజు అందిస్తున్నామన్నారు. ఇర్లపాడులోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ హాల్‌ను రూ.1.50 లక్షల వ్యయంతో, కనపర్రులో మరో రూ.50వేల వ్యయంతో కాంపౌండ్ వాల్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోటేశ్వరమ్మ, ప్రధానోపాధ్యాయుడు పార్థసారథి, ఉప సర్పంచ్ రాజేష్ తదితరులు వారు చేసిన సేవలను కొనియాడారు.

రేపు సామాజిక సాంస్కృతిక వేదిక 'బాసట' ప్రారంభం

యడ్లపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక సాంస్కృతిక వేదిక (బాసట)ను శనివారం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు ముత్తవరపు రవీంద్ర, సామినేని శ్రీనివాసరావులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా యడ్లపాడు గ్రామాభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్‌ల పేరుతో మెడికల్, సమ్మర్ ఎడ్యుకేషన్ క్యాంపులు, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదన్నారు. అయితే ప్రస్తుతం రెండింటిని ఏకంచేసి బాసట పేరుతో ట్రస్టుగా రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. బాసట వేదికను ఈ నెల 21న యడ్లపాడులోని పీఆర్ విజ్ఞాన కేంద్రం వేదికగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గతంలో నిర్వహించిన కార్యక్రమాలతో పాటు నూతనంగా పర్యావరణ హితమైన కార్యక్రమాలు బాసట ద్వారా నిర్వహించనున్నామన్నారు. సమాజంపై బాధ్యతగా వ్యవహరించే పౌరులను కలుపుకుని బాసట వేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.